PRGI Reg No -"APTEL/26/A1193

# నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక

చదవండి..... చదివించండి....

శుభోదయ

ప్రతిక్షణం... ప్రజల కోసం...

www.netishubhodaya.com

96965 71571

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, సంపుటి 01, సంచిక 155, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -8, ఆదివారం - 26 - జూలై - 2026 , వెల రూ.5/-

## భవిష్యత్తులో ఏ దేశ ఆస్తులకూ భద్రత ఉండదు.

- ఇతర దేశాల ఆస్తులను స్వాధీనం చేసుకుని భవిష్యత్తు నష్టపరిహారాలకు వినియోగించడం "పేలుడు స్వభావం కలిగిన ప్రమాదకరమైన సంప్రదాయానికి నాంది" అని వ్యాఖ్యానించారు
- "ఒక దేశానికి చెందిన ఆస్తులను మరో దేశం సంబంధం లేని అంశాలకు ఉపయోగించడం సాధారణమైతే.. భవిష్యత్తులో ఏ దేశ ఆస్తులకూ భద్రత ఉండదు.



అమెరికా--ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి తీవ్ర స్థాయికి చేరుకున్నాయి. యుద్ధ పరిణామాల నేపథ్యంలో ఇరాన్‌కు చెందిన స్తంభింపజేసిన నిధులను(ఫ్రీజ్డ్ ఫండ్స్) మిగతా 2లో

## ఇది చాల్లేదు.. ఇరాన్‌కు ఇంకా నొప్పి తెలియట్లేదు

- పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు రోజురోజుకీ తీవ్రరూపం దాలుస్తున్నాయి.
- ఇరాన్ మౌలిక వసతులపై అమెరికా బలగాలు దాడులు కొనసాగిస్తుండగా.. ప్రతిగా గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ కౌంటర్ అటాక్‌లు జరుపుతోంది.



పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు రోజురోజుకీ తీవ్రరూపం దాలుస్తున్నాయి. ఇరాన్ మౌలిక వసతులపై అమెరికా బలగాలు దాడులు కొనసాగిస్తుండగా.. ప్రతిగా గల్ఫ్ దేశాల్లోని మిగతా 2లో

## వీడిన సౌదీ యువరాజు డెత్ మిస్టరీ

- సౌదీ రాజకుటుంబంలో నెలకొన్న డెత్ మిస్టరీ దాదాపుగా వీడింది.
- లండన్‌లోని ఓ విలాసవంతమైన హోటల్‌లో గతేడాది చివర్లో సౌదీ ప్రిన్స్ అబ్దుల్లా బిన్ ఫహాద్ అల్ సౌద్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు.



సౌదీ రాజకుటుంబంలో నెలకొన్న డెత్ మిస్టరీ దాదాపుగా వీడింది. లండన్‌లోని ఓ విలాసవంతమైన హోటల్‌లో గతేడాది చివర్లో సౌదీ ప్రిన్స్ అబ్దుల్లా బిన్ ఫహాద్ అల్ సౌద్ మిగతా 2లో

## యువత భవిష్యత్తే మోదీకి పరమావధి



- విద్యా రంగంలో మోదీ ప్రభుత్వం విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చిందన్న మాధవ్
- గతంలో పోలిస్తే పేపర్ లీకేజీలు బాగా తగ్గాయని వెల్లడి
- నీట్ సాకుతో సుప్రీంకోర్టుపై కూడా అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపాటు
- ప్రధాని మోదీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం యువత భవిష్యత్తును పరమావధిగా చేసుకుని పనిచేస్తోందని బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ స్పష్టం చేశారు.

ప్రధాని మోదీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం యువత భవిష్యత్తును పరమావధిగా చేసుకుని పనిచేస్తోందని బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు మిగతా 2లో

# రౌడీయిజం సహించేది లేదు

## శాంతిభద్రతల విషయంలో కఠినంగా ఉంటాం

### వైసీపీపై నిప్పులు.. అధికారులకు క్లాస్.. ఆలూరులో చంద్రబాబు ఫైర్

- కర్నూలు జిల్లా ఆలూరులో సంజీవని కార్యక్రమం
- అధికారుల పనితీరుపై సీఎం చంద్రబాబు తీవ్ర అసంతృప్తి
- పలు శాఖల అధికారులను నిలదీసి, పనితీరు మార్చుకోవాలని గట్టిగా హెచ్చరించిన వైనం
- బాబాయ్ హత్య కేసును ప్రస్తావిస్తూ వైసీపీపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు



కర్నూలు: ముఖ్యమంత్రి చంద్రబాబు తన పాలనలో నిర్లక్ష్యానికి, అలసత్వానికి చోటు లేదని గట్టిగా హెచ్చరించారు. కర్నూలు జిల్లా ఆలూరులో సంజీవని కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ.. వైసీపీపై తీవ్ర స్థాయిలో విమర్శలు మిగతా 2 లో

## మెగా డీఎస్సీలో అక్రమాలపై పార్లమెంటులో చర్చించాలి



- ఉభయ సభల్లో వైఎస్సార్‌సీపీ వాయిదా తీర్మానం
- రాజ్యసభలో ప్రవేశపెట్టిన వైవీ సుబ్బారెడ్డి
- లోక్‌సభలో వాయిదా తీర్మానం కోరిన మద్దిల గురుమూర్తి

మెగా డీఎస్సీలో చోటుచేసుకున్న అంతులేని అక్రమాలపై అలుపెరుగని పోరాటం చేస్తున్న ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ.. ఇప్పుడు పార్లమెంట్ వేదికగా చంద్రబాబు ప్రభుత్వాన్ని ఎండగట్టడానికి సన్నద్ధమైంది. చంద్రబాబు ప్రభుత్వం ఆర్భాటంగా ప్రచారం చేసుకున్న దాదాపు 16వేల టీచర్ల నియామకానికి సంబంధించిన మెగా డీఎస్సీ--2025లో భారీ స్థాయి అక్రమాలపై పార్లమెంట్ ఉభయసభలలో చర్చ జరగాలని మిగతా 2లో



2లో

## రాహుల్ పోరాటం, విద్యార్థుల ఐక్యత వల్ల కేంద్రం దిగివచ్చింది

- అప్రజాస్వామిక విధానాలపై సాధించిన గొప్ప గెలుపన్న పొన్నం
- కేంద్రంపై ఉన్న వ్యతిరేకతకు ఇది నిదర్శనమని వ్యాఖ్య

హైదరాబాద్: కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం విద్యార్థులు, ఉద్యమకారుల విజయమని తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి

## ఇది యువత సాధించిన విజయం

### నీట్-యూజీ వివాదం నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై ప్రియాంక గాంధీ

ఇది యువత సాధించిన విజయమని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ హర్షం

యువత గొంతును ఎప్పటికీ ఎవరూ అణచివేయలేరని ప్రియాంక వ్యాఖ్య




ఢిల్లీ: నీట్-యూజీ పరీక్షల అవకతవకల వివాదం నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా హర్షం వ్యక్తం చేశారు. ఇది దేశ యువత సాధించిన విజయమని, వారి గొంతును ఎవరూ, ఎప్పటికీ అణచివేయలేరని మిగతా 2 లో

## గుంతకల్లు - బళ్లారి రైల్వే లైన్లకు

# కేంద్ర కేబినెట్ గ్రీన్ సిగ్నల్

### మోదీకి చంద్రబాబు ధన్యవాదాలు

- గుంతకల్లు - బళ్లారి మధ్య 3వ, 4వ రైల్వే లైన్ల నిర్మాణానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం
- రాయలసీమ, ఉత్తర కర్ణాటక, గోవా రాష్ట్రాల మధ్య పెరగనున్న రవాణా అనుసంధానం



అమరావతి: గుంతకల్లు - బళ్లారి మధ్య 3వ, 4వ రైల్వే లైన్ల నిర్మాణానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలపడంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి మిగతా 2 లో

## మెగా పీటీఎంతో విద్యార్థుల ప్రగతి మరింత పురోగతి




- చదువు పూర్తి కాగానే ఉద్యోగాలు
- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత
- రాష్ట్రంలో విస్తృతంగా పరిశ్రమల ఏర్పాటు
- పారిశ్రామీకరణతో స్థానికంగానే ఉద్యోగాలు

యువతకు ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, ఉన్నత విద్య పూర్తికాగానే స్థానికంగానే ఉద్యోగాలు లభించేలా రాష్ట్ర వ్యాప్తంగా పరిశ్రమలు నెలకొల్పుతున్నామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి మిగతా 2లో

- 'స్థానిక' ఎన్నికలు ప్రతిష్టాత్మకం
- ప్రజా సమస్యలపై గళం విప్పాలి
- క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలి
- ఆగస్టు 15 నుంచి గ్రామాల్లో పార్టీ సమావేశాలు
- నాలుగు నెలల పాటు కో-ఆర్డినేటర్లు, గ్రామ, వార్డు పర్యటనలు చేయండి
- సర్ ఆర్థర్ కాటన్‌కు వైఎస్సార్‌సీపీ అధినేత,మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నివాళులర్పించారు.
- మేరకు వైఎస్ జగన్ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు.
- మహాకవి గుర్రం జాషువా వర్ధంతి. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్.. జాషువాకు నివాళులు అర్పించారు.
- కృష్ణాగోదావరి నదీ జలాలను సద్వినియోగం చేసి, రాష్ట్ర సమగ్రాభివృద్ధికి బలమైన పునాది వేసిన మహనీయుడు సర్ ఆర్థర్ కాటన్ గారు. ఆయన దూరదృష్టితో రూపుదిద్దుకున్న సాగునీటి వ్యవస్థలు ఆంధ్రప్రదేశ్‌ను సస్యశ్యామలం చేసి, వ్యవసాయ రంగ ప్రగతికి నూతన దిశానిర్దేశం చేశాయి

## ప్రతి స్థానంలో వైఎస్సార్‌సీపీ

# పోటీ చేసి గెలవాల్సిందే

### సర్ ఆర్థర్ కాటన్‌కు వైఎస్ జగన్ నివాళులు

### గుర్రం జాషువాకు వైఎస్ జగన్ నివాళులు



సర్ ఆర్థర్ కాటన్‌కు వైఎస్సార్‌సీపీ అధినేత,మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నివాళులర్పించారు. ఈమేరకు వైఎస్ జగన్ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు.కృష్ణాగోదావరి నదీ జలాలను సద్వినియోగం చేసి, రాష్ట్ర సమగ్రాభివృద్ధికి బలమైన పునాది వేసిన మహనీయుడు మిగతా 2లో

## పవన్ కోసం కలసికట్టుగా పనిచేద్దాం



- స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని జనసైనికులకు నాదెండ్ల పిలుపు
- గ్రూపు రాజకీయాలు పక్కన పెట్టాలని హితవు
- అన్ని పదవులు ఒకేసారి ఆశించవద్దన్న మనోహర్

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా జనసేన శ్రేణులు ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాలని, నాయకులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్ పిలుపునిచ్చారు. పార్టీలో అంతర్గత విభేదాలకు, గ్రూపు రాజకీయాలకు ఏమాత్రం తావులేకుండా అందరూ కలసికట్టుగా పనిచేయాలని స్పష్టం చేశారు. మిగతా 2లో

నేటి శుభోదయ
ప్రతి క్షణం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక



## భవిష్యత్తులో ఏ దేశ ఆస్తులకూ భద్రత ఉండదు.

వినియోగిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన సంచలన ప్రకటన ఇప్పుడు అంతర్జాతీయంగా చర్చకు దారితీసింది. అయితే ఈ ప్రకటనపై ఇరాన్ ఘాటుగా స్పందించింది. అమెరికా ఆధీనంలో ఉన్న ఇరాన్‌కు చెందిన స్తంభింపజేసిన నిధులను.. అమెరికా నౌకలు, సరుకు రవాణా నౌకలు, ఇతర సంబంధిత ఆస్తులకు జరిగిన నష్టాల భర్తీకి ఉపయోగిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా ప్రకటించారు. ఇరాన్ చర్యల వల్ల జరిగిన నష్టాలకు పరిహారం చెల్లించేందుకు ఈ నిధులను వినియోగిస్తామని ఆయన స్పష్టం చేశారు. అయితే అమెరికా--ఇరాన్ మధ్య సైనిక ఉద్రిక్తతలు కొనసాగుతున్న సమయంలో ట్రంప్ ప్రకటన రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. వాషింగ్టన్ మళ్లీ దాడులు ప్రారంభించిన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు మరింత వేడి పెంచాయి."ఇకపై నౌకలు, సరుకు లేదా వాటికి సంబంధించిన ఏదైనా ఆస్తికి జరిగే నష్టాలను అమెరికా ఆధీనంలో ఉన్న ఇరాన్ డబ్బుతో చెల్లిస్తాం" అని ట్రంప్ పేర్కొన్నారు. ఈ నష్టాలు భారీగా ఉండొచ్చని, అయినప్పటికీ ఇది న్యాయమైన చర్య అని ఆయన సమర్థించారు. ఇరాన్ మద్దతు ఉన్న యెమెన్ హౌతీ తిరుగుబాటుదారులు ఎర్ర సముద్రంలో రెండు సౌదీ చమురు నౌకలపై దాడులకు పాల్పడినట్లు ప్రకటించిన నేపథ్యంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు.ట్రంప్ ప్రకటనపై ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ తీవ్రంగా స్పందించారు. ఇతర దేశాల ఆస్తులను స్వాధీనం చేసుకుని భవిష్యత్తు నష్టపరిహారాలకు వినియోగించడం "పేలుడు స్వభావం కలిగిన ప్రమాదకరమైన సంప్రదాయానికి నాంది" అని వ్యాఖ్యానించారు.

## ఇది చాల్లేదు.. ఇరాన్‌కు ఇంకా నొప్పి తెలియట్లేదు

అమెరికా స్థావరాలపై ఇరాన్ కౌంటర్ అటాక్‌లు జరుపుతోంది. మరోవైపు ఇరాన్ మద్దతు ఉన్న హౌతీలు కూడా రంగంలోకి దిగడంతో ఈ ఘర్షణ మరింత విస్తరించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇరాన్‌పై మరింత కఠిన చర్యలకు దిగాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భావిస్తున్నట్లు తెలుస్తోంది.ఇరాన్‌పై భారీ స్థాయి సైనిక చర్యను పరిశీలిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. ఇప్పటికే జరుగుతున్న దాడులు సరిపోలేదని భావిస్తున్న ఆయన.. "ఇరాన్‌కు ఇంకా తగినంత నొప్పి తెలియలేదు" అంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆక్సియోస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ.. ఇరాన్‌పై గతంలో కంటే పెద్ద స్థాయిలో దాడి చేసే అవకాశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. "నేను భారీ దాడి గురించి ఆలోచిస్తున్నాను. ఇప్పటివరకు జరిగిన వాటికంటే పెద్దదిగా ఉంటుంది. నిర్ణయం తీసుకునే దశకు చేరుకున్నాను" అని పేర్కొన్నారు. దీంతో ఒక్కసారిగా అలజడి రేగింది. అయితే కొత్త దాడికి సంబంధించి అధ్యక్షుడు తుది నిర్ణయం తీసుకోలేదని అమెరికా అధికారులు వెల్లడించారు. ఎలాంటి కొత్త సైనిక ఆదేశాలు కూడా జారీ కాలేదని తెలిపారు.

## వీడిన సౌదీ యువరాజు డెత్ మిస్టరీ

అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. ఆయన గుండె ఆగిపోవడంతోనే మరణించారని ప్రాథమిక విచారణలో తేలింది. అయితే.. మృతికి గల కారణాలపై ఇప్పుడు ఓ స్పష్టత వచ్చింది. మద్యం పార్టీలో డ్రగ్స్ కలిపిన డ్రింక్స్ సేవించడం.. అది ఓవర్‌డోస్ కావడం వల్లే అతను చనిపోయినట్లు బ్రిటన్ కోర్టు విచారణలో వెల్లడి కావడం కలకలం రేపుతోంది. 29 ఏళ్ల సౌదీ యువరాజు అబ్దుల్లా బిన్ ఫహాద్ బిన్ అబ్దుల్లా బిన్ అబ్దులజీజ్ బిన్ జలావి అల్ సౌద్.. లండన్‌లోని కెన్సింగ్టన్ ప్రాంతంలోని మారియట్ హోటల్‌లో నవంబర్ 25న మృతి చెందారు. రాజకుటుంబం కావడంతో.. ఈ విషయాన్ని అత్యంత గోప్యంగా ఉంచి దర్యాప్తు జరిపారు. దీంతో విషయం చాలా ఆలస్యంగా బయటకు వచ్చింది. వారానికి పైగా ఉండేందుకు నవంబర్ 19న ఆయన హోటల్‌లో దిగినట్లు విచారణలో తేలింది. మరణానికి ముందు రోజు రాత్రి యువరాజు సిగరెట్ తాగేందుకు హోటల్ బయటకు వెళ్లిన దృశ్యాలు సీసీటీవీ కెమెరాల్లో నమోదయ్యాయి. ఆ తర్వాత ఆయన గదికే వెళ్లిపోయారు. మరుసటి రోజు హోటల్ సిబ్బంది గదిని శుభ్రం చేసేందుకు వెళ్లగా.. బాత్‌రూమ్‌లో ఆయన అపస్మారక స్థితిలో కనిపించారు. వెంటనే అత్యవసర సిబ్బందికి సమాచారం అందించినా.. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.మరణంపై నిర్వహించిన టాక్సికాలజీ పరీక్షల్లో సంచలన విషయాలు బయటపడ్డాయి. యువరాజు రక్తంలో మద్యం స్థాయి అత్యంత ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు.

## యువత భవిష్యత్తే మోదీకి పరమావధి

పీవీఎన్ మాధవ్ స్పష్టం చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా విద్యా రంగంలో మోదీ ప్రభుత్వం విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చిందని, దేశవ్యాప్తంగా ఐఐటీలు, ఐఐఎంలు, గిరిజన విశ్వవిద్యాలయాలను నెలకొల్పడంతో పాటు మెడికల్ సీట్లను భారీగా పెంచిందని వివరించారు. గత ప్రభుత్వాల హయాంతో పోలిస్తే తమ పాలనలోనే విద్యా పేపర్ లీకేజీలు గణనీయంగా తగ్గాయని, నీట్ వ్యవహారంలో సమస్య వెలుగుచూడగానే కేంద్రం తక్షణమే కఠిన చర్యలు తీసుకుందని తెలిపారు. నీట్ వివాదాన్ని సాకుగా చూపి కొందరు విపక్ష నేతలు ఢిల్లీ వేదికగా మత విద్వేషాలను రెచ్చగొట్టేందుకు కుట్రలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. నీట్ సాకుతో ప్రధానితో పాటు అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని, నటుడు ప్రకాశ్ రాజ్ సహా కొందరు విద్రోహకర, దేశ వ్యతిరేక వ్యాఖ్యలకు పాల్పడటం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని విద్యా సంఘాలు విద్యార్థుల ప్రయోజనాలను పక్కనబెట్టి వారి భవిష్యత్తును నాశనం చేసేలా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి దమ్ముంటే తమ సొంత పాలనలో జరిగిన పేపర్ లీకేజీలపై పార్లమెంట్‌లో మాట్లాడాలని, సభలో చర్చల్లో పాల్గొనే ధైర్యం లేకనే ఆయన దాటవేత ధోరణి ప్రదర్శిస్తున్నారని సవాల్ విసిరారు. విశాఖ సమీపంలోని భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవానికి ప్రధాని నరేంద్ర మోదీ వస్తున్నారని, ఈ చారిత్రాత్మక ఘట్టంలో 13 వేల మంది కళాకారులతో కూడిన సంప్రదాయ థింసా నృత్యం, బొబ్బిలి వీణా నాదంతో ఆయనకు అద్భుత స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. అంతేకాకుండా ఈ కార్యక్రమం సందర్భంగా ఏకంగా 3 లక్షల మందితో భారీ బహిరంగ సభను నిర్వహించబోతున్నట్లు ప్రకటించారు. భోగాపురం విమానాశ్రయం అందుబాటులోకి వచ్చాక ఉత్తరాంధ్రలో వెనుకబడిన ప్రాంతమంటూ ఏదీ ఉండకూడదనేది సీఎం చంద్రబాబు ఆలోచన అని, ఆ ప్రాంత సమగ్ర ప్రాజెక్టుగా ఇది నిలుస్తుందని పేర్కొన్నారు. విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు పేరును చిరస్థాయిగా నిలిపేందుకే ఈ అంతర్జాతీయ విమానాశ్రయానికి ఆయన పేరు పెట్టారని మాధవ్ వివరించారు.

## మెగా డీఎస్సీలో అక్రమాలపై పార్లమెంటులో చర్చించాలి

వైఎస్సార్‌సీపీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఉభయ సభల్లో వేర్వేరుగా వాయిదా తీర్మానాలు ప్రవేశపెట్టింది. రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత వైవీ సుబ్బారెడ్డి, లోక్‌సభలో ఎంపీ ఎం.గురుమూర్తి వాయిదా తీర్మానాలను ప్రవేశపెట్టారు. 'మెగా డీఎస్సీ--2025లో జరిగిన అక్రమాలు దాదాపు 3.5 లక్షల మంది టీచర్ అభ్యర్థుల భవిష్యత్తును గందరగోళంలోకి నెట్టాయి. ప్రస్తుతం 22.79 లక్షల మంది 'నీట్' అభ్యర్థుల సమస్యపై పార్లమెంటులో చర్చించినప్పుడు, ఆంధ్రప్రదేశ్‌లో 3.5 లక్షల మంది టీచర్ అభ్యర్థుల భవిష్యత్తును అంధకారం చేస్తున్న మెగా డీఎస్సీ అక్రమాలపైనా చర్చ జరగాలి. అంతేకాదు ఇది నిరుద్యోగ యువత భవిష్యత్తు. ప్రభుత్వ సంస్థల విశ్వసనీయత, ప్రభుత్వ ఉద్యోగాల్లో సమాన అవకాశాలకు సంబంధించిన అంశం. అత్యంత పకడ్బందీగా నిర్వహించాల్సిన పోటీపరీక్షపై ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శించడం, పరీక్ష నిర్వహణను ఔట్ సోర్సింగ్ సిబ్బందికి అప్పగించడం, తుది ఫలితాలకు సంబంధించి మెరిట్, రోస్టర్ జాబితాలను బహిర్గతం చేయకపోవడం, సర్టిఫికెట్ వెరిఫికేషన్ తర్వాత కూడా జాబితాల నుంచి అభ్యర్థుల పేర్లను తారుమారు చేయడం, స్పోర్ట్స్ కోటా నిబంధనల్లో మార్పులు చేయడం, రిజర్వేషన్లు పాటించకపోవడం, ప్రశ్నపత్రాల లీకేజీ, డబ్బులకు ఉద్యోగాలు ఇచ్చారనే ఆరోపణలు వెల్లువెత్తడం, పరీక్షా పనులతో సంబంధం ఉన్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగికి ఏకంగా మొదటి ర్యాంకు రావడం, దీనిపై విమర్శలు రావడంతో తర్వాత అతని పేరును తుది జాబితా నుంచి తొలగించడం వంటి పలు అవకతవకలు టీచర్ అభ్యర్థుల విశ్వాసాన్ని దెబ్బ తీశాయి. దీనిపై సీబీఐతో దర్యాప్తు జరిపించాలి. డిజిటల్ ఆధారాలను భద్రపరిచేలా చర్యలు తీసుకోవాలి, అర్హులైన టీచర్ అభ్యర్థులకు న్యాయం చేయాలి'అని వాయిదా తీర్మానాల్లో ఎంపీలు పేర్కొన్నారు.

## మెగా పీటీఎంతో విద్యార్థుల ప్రగతి మరింత పురోగతి

శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమని నమ్మిన వ్యక్తి సీఎం చంద్రబాబు అని, విద్యార్థుల డ్రాపౌట్ల నివారణే లక్ష్యంగా పలు సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారని అన్నారు. మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్(పీటీఎం)తో విద్యార్థుల పురోగతి మరింత మెరుగుపడుతుందన్నారు. నర్సాపూర్ నియోజక వర్గం స్టేషన్ పేటలో ఉన్న మహాత్మాజ్యోతిరావు పూలే బాలుర గురుకుల పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన మెగా పీటీఎం కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే బొమ్మడి నారాయణ నాయకర్ తో ఆమె పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో విద్యాభివృద్ధికి సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. అన్న ఎన్టీఆర్ గురుకుల విద్యను ప్రారంభిస్తే, సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో అత్యధిక గురుకుల పాఠశాలలు, కళాశాలలు ఏర్పాటయ్యాయన్నారు. .

## పవన్ కోసం కలసికట్టుగా పనిచేద్దాం

"మనమంతా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వం కోసమే పనిచేస్తున్నాం.. వ్యక్తిగత వర్గాలు వద్దే వద్దు" అని శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.గత కార్పొరేషన్ ఎన్నికల్లో అనేక ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పటికీ జనసేన ధైర్యంగా నిలబడిందని, విజయవాడలోని 39 డివిజన్లలో పోటీ చేసి సుమారు 50 వేల ఓట్లు సాధించడమే పార్టీకి ఉన్న క్షేత్రస్థాయి బలానికి నిదర్శనమని అన్నారు. ఆ ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన నాయకులు, కార్యకర్తల శ్రమను పార్టీ ఎప్పటికీ మరువదని చెప్పారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో పోటీ చేయాలనుకునేవారు కేవలం సింబల్ పైనే ఆధారపడకుండా, వ్యక్తిగత విశ్వసనీయతను, ప్రజలతో అనుబంధాన్ని పెంచుకోవాలని సూచించారు. కేవలం కార్లలో తిరుగుతూ పెద్ద ఫ్లెక్సీలు, బ్యానర్లు కట్టినంత మాత్రాన ఓట్లు రావని, సమస్యల పరిష్కారంలో భాగమైనప్పుడే ప్రజలు మద్దతు ఇస్తారని స్పష్టం చేశారు.ప్రస్తుతం జనసేన ఎన్డీఏ కూటమిలో భాగస్వామిగా ఉన్నందున అన్ని పదవులను ఒకేసారి ఆశించడం సరికాదని, దశాబ్దాలుగా ఉన్న ఇతర కూటమి పార్టీలతో సమన్వయం చేసుకుంటూ క్రమంగా పార్టీని మరింత బలోపేతం చేయాలని దిశానిర్దేశం చేశారు. అదే సమయంలో సోషల్ మీడియా వేదికగా జనసేన పార్టీపై, పవన్ కళ్యాణ్‌పై జరుగుతున్న తప్పుడు ప్రచారాలను, దుష్ప్రచారాన్ని కార్యకర్తలు సమర్థవంతంగా తిప్పికొట్టాలని, నిజాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.ం

### తాత్కాలిక ఉపశమనం కాదు,

## శాశ్వత పరిష్కారం కావాలి

మొదటి పేజి తరువాయి

శనివారం కర్నూలు జిల్లా పర్యటనకు బయలుదేరే ముందు ముఖ్యమంత్రి చంద్రబాబుతో కేంద్ర వాణిజ్య శాఖ అదనపు కార్యదర్శి నితిన్ కుమార్ యాదవ్, డైరెక్టర్ మౌనికా గౌర్ భేటీ అయ్యారు. ఈ కీలక సమావేశంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డీబీవీ స్వామి, వ్యవసాయ, మార్క్‌ఫెడ్ ఉన్నతాధికారులు, టొబాకో బోర్డు ప్రతినిధులు పాల్గొన్నారు. పొగాకు రైతులను ఆదుకునేందుకు రూపొందించిన మూడు కీలక ప్రతిపాదనలపై కేంద్ర బృందం సీఎంతో చర్చించింది. వడ్డీ లేని వర్కింగ్ క్యాపిటల్ రుణాలు, ప్రోత్సాహకాలు, ధర లోటు భర్తీ వంటి అంశాలు ఈ ప్రతిపాదనల్లో ఉన్నాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, ఏ నిర్ణయం తీసుకున్నా రైతుల ప్రయోజనాలకే పెద్దపీట వేయాలని స్పష్టం చేశారు. ఏటా ఇదే సమస్య పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం కనుగొనాలని సూచించారు. "తాత్కాలిక ఉపశమన చర్యలతో సరిపెట్టకుండా, స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక వ్యూహాలతో ఒక సమగ్ర విధానాన్ని రూపొందించాలి. రైతులు, బయ్యర్లు, టొబాకో బోర్డు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు.. అందరి సమష్టి బాధ్యతతోనే ఇది సాధ్యం" అని ఆయన అభిప్రాయపడ్డారు. పంటను నిల్వ ఉంచుకుని ధరలు స్థిరపడ్డాక అమ్ముకునే అవకాశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. చర్చలను ముందుకు తీసుకెళ్లి, పరిష్కారం కనుగొనాలని కేంద్ర మంత్రి పెమ్మసానికి సూచించారు.సీఎం సూచనల మేరకు, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, కేంద్ర ప్రభుత్వ అధికారులతో కలిసి పొగాకు బయ్యర్లతో వర్చువల్ సమావేశం నిర్వహించారు. రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వాలు సిద్ధంగా ఉన్నాయని, బయ్యర్లు కూడా సహకరించాలని కోరారు. తదుపరి చర్చల కోసం సోమవారం మరోసారి సమావేశం కావాలని నిర్ణయించారు. ఈ భేటీలో పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు పాల్గొని రైతుల కష్టాలను కేంద్ర ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు.

### రౌడీయిజం సహించేది లేదని,

## శాంతిభద్రతల విషయంలో కఠినంగా ఉంటాం

కర్నూలు: ముఖ్యమంత్రి చంద్రబాబు తన పాలనలో నిర్లక్ష్యానికి, అలసత్వానికి చోటు లేదని గట్టిగా హెచ్చరించారు. కర్నూలు జిల్లా ఆలూరులో సంజీవని కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ.. వైసీపీపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించడంతో పాటు, ప్రభుత్వ అధికారుల పనితీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ప్రజాధనం వృథా అయినా, ప్రజలకు సేవలు అందడంలో జాప్యం జరిగినా సహించేది లేదని స్పష్టం చేశారు.

ప్రతిపక్షంపై తీవ్ర విమర్శలు

గత ఐదేళ్ల పాలనలో రాయలసీమకు చేసిందేమీ లేదని, తాము రెండేళ్లలోనే ఇరిగేషన్‌పై రూ.12 వేల కోట్లు ఖర్చు చేస్తే, వారు ఐదేళ్లలో రూ.2 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారని చంద్రబాబు ఆరోపించారు. "బాబాయిని గొడ్డలితో లేపేసి, ఆ కేసును మా మీదకు నెట్టి సానుభూతితో ఓట్లు సంపాదించుకోవాలని చూశారు. ఇకపై అలాంటి నీచ రాజకీయాలు సాగవు. రౌడీయిజం చేసే వారిని, ఆడబిడ్డల జోలికి వచ్చేవారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదు. శాంతిభద్రతల పరిరక్షణకు మా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుంది" అని చంద్రబాబు ఘాటుగా హెచ్చరించారు. గతంలో రాయలసీమలో ఫ్యాక్షన్ గొడవలు ఉండేవని, తమ పాలనలో శాంతిని నెలకొల్పామని గుర్తుచేశారు. అనంతరం, నియోజకవర్గంలో ప్రభుత్వ పథకాలు, సేవల అమలుపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. 42 రకాల సేవలపై తన వద్ద ఉన్న డేటాను ప్రస్తావిస్తూ, పలువురు అధికారుల పనితీరుపై బహిరంగంగానే అసంతృప్తి వెళ్లగక్కారు. అన్న క్యాంటీన్ నిర్వహణ, తాగునీటి సరఫరా, రోడ్లపై గుంతలు, రీసర్వే, మధ్యాహ్న భోజనం, సాంఘిక సంక్షేమ హాస్టళ్ల నిర్వహణ వంటి అంశాల్లో ఆలూరు నియోజకవర్గం వెనుకబడి ఉందని గణాంకాలతో సహా వివరించారు. తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యంపై సంబంధిత అధికారిని నిలదీసిన సీఎం, "మీ పరిస్థితి బాగాలేదు. మళ్లీ వస్తా.. పరిస్థితి మారకపోతే చాలా సీరియస్‌గా ఉంటుంది. అవసరమైతే ట్యాంకర్లు పెట్టండి, కానీ ప్రజలకు నీళ్లు ఇవ్వాల్సిందే" అని ఆదేశించారు. ఆర్టీసీ బస్సు సర్వీసులు కూడా సరిగా లేవన్న ఫిర్యాదులపై స్పందిస్తూ, "మీరు ఆంధ్రాలో ఉన్నారో, కర్ణాటకలో ఉన్నారో అర్థం కావడం లేదు. నెల రోజుల్లో పరిస్థితి మారకపోతే మీ కథ వేరేగా ఉంటుంది" అని ఆర్టీసీ అధికారికి వార్నింగ్ ఇచ్చారు. తాను ఇంత కష్టపడుతుంటే క్షేత్రస్థాయిలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని, పనితీరు మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ క్రమంలోనే, గిరిజన సంక్షేమ హాస్టళ్లు, శాప్ వంటి కొన్ని శాఖల పనితీరును ప్రశంసించడం గమనార్హం. ప్రజలకు మెరుగైన పాలన అందించే వరకు తన పోరాటం ఆగదని చంద్రబాబు ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

### ఇది యువత సాధించిన విజయం

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై ప్రియాంక గాంధీ

ఢిల్లీ: నీట్-యూజీ పరీక్షల అవకతవకల వివాదం నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా హర్షం వ్యక్తం చేశారు. ఇది దేశ యువత సాధించిన విజయమని, వారి గొంతును ఎవరూ, ఎప్పటికీ అణచివేయలేరని ఆమె స్పష్టం చేశారు. శనివారం తన లోక్‌సభ నియోజకవర్గమైన కేరళలోని వయనాడ్‌లో విలేకరులతో మాట్లాడిన ప్రియాంక గాంధీ, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా వార్త తనను కొంత భావోద్వేగానికి గురిచేసిందని తెలిపారు. "గత పది, పన్నెండేళ్లుగా మన యువత ఎప్పుడు చైతన్యవంతమవుతుందా అని నేను అనేకసార్లు నన్ను నేను ప్రశ్నించుకున్నాను. నేడు దేశ యువత గళం విప్పింది, వారి గొంతు వినిపించింది. ఇది ఎంతో సంతోషకరమైన విషయం" అని ఆమె పేర్కొన్నారు. ప్రభుత్వం తీరుపై విమర్శలు గుప్పిస్తూ, "ఆర్ఎస్ఎస్ తన భావజాలంతో మొత్తం విద్యా వ్యవస్థను నింపేస్తోంది. మన పూర్వీకుల సిద్ధాంతాలను ప్రణాళికాబద్ధంగా నాశనం చేస్తున్నారు. నిరసన తెలిపిన వారిపై అధికార బలాన్ని ప్రయోగించారు. అయితే, ప్రజలే అత్యంత శక్తివంతులని ప్రతి పాలకుడూ ఈ ఘటన ద్వారా గుణపాఠం నేర్చుకోవాలి. ఈ రోజు మన దేశాన్ని మనం తిరిగి నిలబెట్టుకుంటున్నాం" అని ఆమె వ్యాఖ్యానించారు. నీట్-యూజీ పేపర్ లీక్ ఆరోపణలపై దేశవ్యాప్తంగా విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టిన విషయం తెలిసిందే. కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ), పర్యావరణవేత్త సోనమ్ వాంగ్‌చుక్ మద్దతుతో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసనలు ఉద్ధృతంగా జరిగాయి. కేంద్ర మంత్రి రాజీనామా చేయాలన్నది వారి ప్రధాన డిమాండ్‌గా ఉంది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను ప్రజాస్వామ్య విజయంగా సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే, సోనమ్ వాంగ్‌చుక్ అభివర్ణించారు.

## గుంతకల్లు - బళ్లారి రైల్వే లైన్లకు కేంద్ర కేబినెట్ గ్రీన్ సిగ్నల్

### మోదీకి చంద్రబాబు ధన్యవాదాలు

అమరావతి: గుంతకల్లు - బళ్లారి మధ్య 3వ, 4వ రైల్వే లైన్ల నిర్మాణానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలపడంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి, ముఖ్యంగా రాయలసీమ ప్రాంత మౌలిక సదుపాయాల కల్పనకు ఈ నిర్ణయం ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందని ఆకాంక్షించారు. ఈ ప్రాజెక్టును ఆమోదించినందుకు ప్రధాని మోదీ, కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌లకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ నూతన రైల్వే మార్గాల వల్ల తూర్పు, పశ్చిమ రైల్వే కారిడార్ మరింత బలోపేతం కావడంతో పాటు... రాయలసీమ, ఉత్తర కర్ణాటక, గోవా రాష్ట్రాల మధ్య రవాణా అనుసంధానం గణనీయంగా మెరుగుపడుతుంది. ప్రయాణికుల ప్రయాణ సమయం తగ్గడంతో పాటు సరకు రవాణా వేగవంతమై, ప్రస్తుతం ఉన్న మార్గాలపై రద్దీ తగ్గుతుంది. మొత్తం రూ.1,264 కోట్ల భారీ వ్యయంతో చేపడుతున్న ఈ ప్రాజెక్టులో దాదాపు రూ.600 కోట్లు కేవలం ఆంధ్రప్రదేశ్ పరిధిలోనే ఖర్చు కానున్నాయి. ఈ రైలు మార్గాల ద్వారా పరిశ్రమలకు ఊతం లభించడమే కాకుండా కృష్ణపట్నం, రామాయపట్నం పోర్టులకు మెరుగైన కనెక్టివిటీ లభిస్తుంది. దీనివల్ల కొత్త ఆర్థిక అవకాశాలు సృష్టింపబడి ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లోని లక్షలాది మంది ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని సీఎం అభిప్రాయపడ్డారు. రాష్ట్ర వేగవంతమైన అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిరంతర సహకారానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

### రాహుల్ పోరాటం, విద్యార్థుల ఐక్యత వల్ల

## కేంద్రం దిగివచ్చింది: పొన్నం ప్రభాకర్

హైదరాబాద్: కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం విద్యార్థులు, ఉద్యమకారుల విజయమని తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. ఇది అప్రజాస్వామిక విధానాలపై సాధించిన గొప్ప గెలుపని ఆయన అభివర్ణించారు. రాహుల్ గాంధీ పోరాటం, దేశవ్యాప్తంగా విద్యార్థులు చూపిన ఐక్యత వల్ల కేంద్ర ప్రభుత్వం దిగిరాక తప్పలేదని తెలిపారు. భవిష్యత్తులో విద్యార్థుల జీవితాలతో ఆడుకోవద్దనే బలమైన గుణపాఠం కేంద్రానికి దక్కిందని స్పష్టం చేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ పతనానికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామానే మొదటి మెట్టు అని పొన్నం ప్రభాకర్ విమర్శించారు. విద్యార్థుల నిరసనలను అణచివేసేందుకు విద్యుత్ సరఫరా నిలిపివేసి, మెట్రో సేవలు బంద్ చేసి, లాఠీ ఛార్జీలు జరిపినా వెరవకుండా వేలాది మంది విద్యార్థులు ధర్నాలో పాల్గొనడం కేంద్రంపై ఉన్న తీవ్ర వ్యతిరేకతకు నిదర్శనమని అన్నారు. ఉద్యమించి విజయం సాధించిన విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలుపుతూ, భవిష్యత్తులోనూ ప్రజావ్యతిరేక విధానాలపై ఇదే రీతిలో ఐక్యంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు.

### విద్యార్థి నేత నుంచి కేంద్ర మంత్రిగా..

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై స్పందించిన కిషన్ రెడ్డి

హైదరాబాద్: కేంద్ర విద్యాశాఖ మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన నేపథ్యంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ఆయన తన స్పందనను తెలియజేశారు. విద్యార్థి దశ నుంచే ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొంటూ, దశాబ్దాల పాటు ప్రజా సేవకు అంకితమైన ధర్మేంద్ర ప్రధాన్ యువత ఆశయాలు, ఆకాంక్షలకు ఎల్లప్పుడూ చేరువగా ఉన్నారని కొనియాడారు. విద్యార్థి నాయకుడిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించిన ధర్మేంద్ర ప్రధాన్, యువత ఎదుర్కొనే సమస్యలతో పాటు విద్య ద్వారా వచ్చే పరివర్తనపై క్షేత్రస్థాయిలో లోతైన అవగాహన కలిగి ఉన్నారని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ అనుభవంతోనే ఆయన విద్యాశాఖ బాధ్యతలను అత్యంత సమర్థవంతంగా నిర్వహించారని అభిప్రాయపడ్డారు. విద్యారంగంలోని క్లిష్టమైన సవాళ్లను సమన్వయం చేస్తూనే, విద్యా అభ్యాసన శక్తిపై పూర్తి విశ్వాసంతో ఆయన పనిచేశారని గుర్తుచేసుకున్నారు. భారతదేశ విద్యారంగానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని, దేశ విద్యార్థుల సంక్షేమం పట్ల ఆయన చూపిన నిబద్ధత, జాతి నిర్మాణంలో ఆయన అందించిన అమూల్యమైన సహకారం ఎప్పటికీ గుర్తుండిపోతాయని ప్రశంసించారు. కేంద్ర మంత్రిగా ధర్మేంద్ర ప్రధాన్ అందించిన అంకితభావంతో కూడిన సేవలకు కిషన్ రెడ్డి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేశారు.

### హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ కుదేలైందనే

## ప్రచారంలో నిజం లేదు: పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్: హైదరాబాద్‌తో పాటు తెలంగాణ రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం కుదేలైందంటూ కొంతమంది ఉద్దేశపూర్వకంగా గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని, ఇందులో ఏమాత్రం నిజం లేదని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ వద్ద ఉన్న స్పష్టమైన గణాంకాలే ఇందుకు నిదర్శనమని అన్నారు. గత రెండున్నరేళ్ల ప్రజా ప్రభుత్వ పాలనలో 15 నుంచి 20 శాతం రియల్ ఎస్టేట్ అభివృద్ధి జరిగిందని, ప్లాట్ల విక్రయాలు ఏకంగా 40 శాతం వరకు పెరిగాయని వెల్లడించారు. గత పదేళ్ల పాలనతో పోలిస్తే ఈ రెండున్నరేళ్లలోనే రెసిడెన్షియల్ మార్కెట్ విశేషంగా పుంజుకుందని తెలిపారు. 2004-2014 మధ్య నాటి కాంగ్రెస్ ముఖ్యమంత్రుల దూరదృష్టి వల్లే ఓఆర్ఆర్, అంతర్జాతీయ విమానాశ్రయం, ఐటీ సెక్టార్ అభివృద్ధితో హైదరాబాద్ రోల్ మోడల్‌గా మారి ప్రపంచ దృష్టిని ఆకర్షించిందని మంత్రి గుర్తుచేశారు. ఇటీవలి దావోస్ పర్యటనలో కూడా పలువురు అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలు నగరంలో పెట్టుబడులకు ఆసక్తి చూపారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో హైదరాబాద్ అభివృద్ధికి ప్రణాళికాబద్ధమైన చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా రూ.7 వేల కోట్లతో మూసీ ప్రక్షాళన, సుందరీకరణ ప్రాజెక్టును చేపడుతున్నామని... తొలి విడత 28 కిలోమీటర్ల పరిధికి వారం పది రోజుల్లో టెండర్లు పిలవనున్నట్లు వెల్లడించారు. అలాగే పాతబస్తీని కలుపుతూ రెండో విడతగా రూ.24 వేల కోట్ల వ్యయంతో 76 కిలోమీటర్ల మేర మెట్రో విస్తరణ, ఆర్ఆర్ఆర్ నుంచి ఓఆర్ఆర్‌లను కలుపుతూ రేడియల్ రోడ్ల నిర్మాణ ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో భూముల భద్రత, భరోసా కోసం 'భూభారతి' చట్టాన్ని అందుబాటులోకి తెచ్చామని, దానిలోని చిన్నపాటి సాఫ్ట్‌వేర్ సమస్యలను మరో 15-20 రోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అలాగే జీహెచ్ఎంసీ/కోర్ పరిధిలోని పేదల కోసం తొలి విడతగా లక్ష ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు.

# ప్రతి స్థానంలో వైఎస్సార్‌సీపీ పోటీ చేసి గెలవాల్సిందే

సర్ ఆర్థర్ కాటన్ గారు. ఆయన దూరదృష్టితో రూపుదిద్దుకున్న సాగునీటి వ్యవస్థలు ఆంధ్రప్రదేశ్‌ను సస్యశ్యామలం చేసి, వ్యవసాయ రంగ ప్రగతికి నూతన దిశానిర్దేశం చేశాయి. నేడు సర్ ఆర్థర్ కాటన్ గారి వర్ధంతి సందర్భంగా మనస్ఫూర్తిగా నివాళులర్పిస్తున్నా' అని పేర్కొన్నారు.మహాకవి గుర్రం జాషువా వర్ధంతి. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్.. జాషువాకు నివాళులు అర్పించారు. వైఎస్ జగన్ ట్విట్టర్ వేదికగా..'అణగారిన వర్గాల ఆవేదనను అక్షరాల్లో ఆవిష్కరించి, సమానత్వం, ఆత్మగౌరవం, మానవీయ విలువల కోసం తన చివరి శ్వాస వరకు అక్షర పోరాటం సాగించిన మహాకవి గుర్రం జాషువా. కాలం మారినా ఆయన ఆలోచనలు, ఆయన సాహిత్యం సమాజానికి చైతన్యాన్ని, సమానత్వానికి స్ఫూర్తిని అందిస్తూనే ఉన్నాయి. గుర్రం జాషువా వర్ధంతి సందర్భంగా ఆ మహనీయునికి నివాళులు' అని పోస్టు చేశారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను అత్యంత కీలకమైనవిగా భావించి పార్టీ శ్రేణులు వాటిని ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు జరిగినా ప్రతి స్థానంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను బరిలోకి దించి.. విజయం సాధించేలా ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని స్పష్టం చేశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ ముఖ్య నాయకులతో వైఎస్ జగన్ సమావేశమయ్యారు. ఈ సమావేశంలో పార్టీ స్టేట్ కో--ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా రీజనల్ కో--ఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ, మాజీ ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్, మాజీ మంత్రులు కురసాల కన్నబాబు, పినిపే విశ్వరూప్, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, కోనసీమ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, జక్కంపూడి విజయలక్ష్మితో పాటు అమలాపురం పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయకర్తలు, నియోజకవర్గ పరిశీలకులు పాల్గొన్నారు. తొలుత జిల్లా ముఖ్య నాయకులతో సమీక్ష నిర్వహించిన వైఎస్ జగన్.. అనంతరం ఒక్కో నియోజకవర్గ సమన్వయకర్తతో విడివిడిగా సమావేశమయ్యారు. ఆయా నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితి, కమిటీల ఏర్పాటు, క్షేత్రస్థాయి సమస్యలు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, భవిష్యత్ కార్యాచరణపై సమగ్రంగా సమీక్షించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు అత్యంత కీలకమైనవని, వాటిని ప్రతి నాయకుడు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని వైఎస్ జగన్ స్పష్టం చేశారు. ఎన్నికలు ఎప్పుడు నిర్వహించినా ఎదుర్కొనేందుకు పార్టీ యంత్రాంగం పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలన్నారు. ప్రతి స్థానంలో పార్టీ పోటీచేసి విజయం సాధించడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని, అందుకు అనుగుణంగా కేడర్‌ను సన్నద్ధం చేయాలని దిశానిర్దేశం చేశారు. పార్టీ ముఖ్య నాయకులంతా ఇప్పటి నుంచే పూర్తి బాధ్యత తీసుకుని గ్రామస్థాయి నుంచి పార్టీ కార్యకలాపాలను వేగవంతం చేయాలన్నారు. ఆగస్టు 15 నుంచి గ్రామాల్లో పార్టీ సమావేశాలు, నాలుగు నెలల పాటు కోఆర్డినేటర్స్ గ్రామ, వార్డు పర్యటనలు, ఈ సమావేశాల్లోనే పార్టీ కమిటీలకు గుర్తింపు కార్డుల పంపిణీ చేపట్టి ప్రజా సమస్యలపై ఎక్కడికక్కడ గళం విప్పాలని నాయకులకు మార్గనిర్దేశం చేశారు. కమిటీల వెరిఫికేషన్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని నాయకులను ఆదేశించారు. కమిటీల్లో ఉత్సాహవంతులు, చురుకైన నాయకులు, పార్టీ కోసం అంకిత భావంతో పనిచేసేవా రంతా ఉండి గుర్తింపు కార్డుల పంపిణీకి అన్ని గ్రామాలకు వెళ్లి సమావేశాలు నిర్వహించాలన్నారు. నాలుగు నెలల పాటు నియోజకవర్గ సమన్వయకర్తలు గ్రామాలు, వార్డులలో పర్యటించి సమావేశాలు ఏర్పాటు చేసి పార్టీ కమిటీలకు గుర్తింపు కార్డులు పంపిణీ చేయడంతో పాటు ప్రజాసమస్యలపై గళం వినిపించాలని సూచించారు. అనుబంధ విభాగాల ద్వారా క్షేత్రస్థాయిలో పార్టీకి పటిష్టమైన నెట్‌వర్క్ సిద్ధమైందని చెప్పారు. ఆయా విభాగాల్లో చురుగ్గా పనిచేస్తున్న నాయకులను సమన్వయం చేసుకుంటూ పార్టీ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలన్నారు. నియోజకవర్గ పరిశీలకులు కూడా తమకు కేటాయించిన ప్రాంతాల్లో ఎక్కువ సమయం వెచ్చించి సమన్వయకర్తలు, స్థానిక నాయకత్వంతో కలిసి పనిచేయాలని సూచించారు. ప్రతి గ్రామంలో నియోజకవర్గ సమన్వయకర్తల ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించాలని వైఎస్ జగన్ ఆదేశించారు.

## పలమనేరు క్యాంపు నుంచి పార్వతీపురానికి కుంకీ ఏనుగుల తరలింపు

కుంకీ ఏనుగులు జయంత్, అభిమన్యులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారు మంగళగిరి క్యాంపు కార్యాలయం వద్ద స్వాగతం పలికారు. గజరాజులకు మార్గమధ్యంలో పూలు చల్లి స్వాగతం పలికిన ఉప ముఖ్యమంత్రివర్యులు, వాటికి స్వయంగా ఆహారం అందజేశారు. అనంతరం గుచ్చిమి శిబిరానికి బయలుదేరిన కుంకీల రెండో అంచె ప్రయాణాన్ని జెండా ఊపి సాగనంపారు.ఈ సందర్భంగా ప్రయాణంలో కుంకీల భద్రతకు తీసుకోవాల్సిన చర్యలపై అటవీ శాఖ అధికారులకు శ్రీ పవన్ కళ్యాణ్ గారు దిశానిర్దేశం చేశారు. గుచ్చిమి క్యాంపునకు చేరిన అనంతరం నిపుణుల పర్యవేక్షణలో అక్కడి వాతావరణ పరిస్థితులకు అలవాటుపడేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. జయంత్, అభిమన్యుల సేవలు పార్వతీపురం పరిసర ప్రాంతాల్లో మానవ-ఏనుగు ఘర్షణల నియంత్రణకు ఎంతో ఉపయోగపడనున్నాయని ఈ సందర్భంగా శ్రీ పవన్ కళ్యాణ్ గారు తెలిపారు. ప్రజల భద్రత, రైతుల పంటల రక్షణ, వన్యప్రాణుల సంరక్షణ లక్ష్యాలను కూటమి ప్రభుత్వం శాస్త్రీయ, మానవీయ విధానాలతో చేపడుతున్న చర్యల్లో భాగంగా కుంకీలను తరలిస్తున్నామని అన్నారు.ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి ఏనుగుల గుంపులు తరచూ పార్వతీపురం మన్యం జిల్లాలోకి ప్రవేశిస్తూ పంటలు, ఆస్తులకు నష్టం కలిగిస్తున్న నేపథ్యంలో, మానవ-ఏనుగు ఘర్షణల నివారణకు కూటమి ప్రభుత్వం చేపడుతున్న ప్రత్యేక చర్యల్లో భాగంగా ఈ కుంకీ ఏనుగులను గుచ్చిమి శిబిరానికి తరలిస్తున్నారు. మానవ-ఏనుగు ఘర్షణల నివారణ చర్యల్లో భాగంగా కుంకీ ఏనుగులైన జయంత్, అభిమన్యులను వినియోగిస్తారు. గతంలో పలమనేరు, చిత్తూరు ప్రాంతాల్లో నిర్వహించిన పలు కీలక ఆపరేషన్లలో ఈ రెండు కుంకీ ఏనుగులు కీలక పాత్ర పోషించాయి. అడవి ఏనుగుల గుంపులను సురక్షితంగా అటవీ ప్రాంతాలకు మళ్లించడంలో ఎంతో చురుకుగా వ్యవహరించాయి.పలమనేరు ముసలిమడుగు ఎలిఫెంట్ క్యాంపు నుంచి జయంత్, అభిమన్యు అనే రెండు కుంకీ ఏనుగులను పార్వతీపురం మన్యం జిల్లాకు అటవీశాఖ అధికారులు తరలిస్తున్నారు. సీతానగరం మండలం గుచ్చిమి వద్ద ఏర్పాటు చేసిన కుంకీ ఏనుగుల క్యాంపుకు తరలించనున్నారు. మన్యం జిల్లాకు వెళ్లే మార్గంలో మంగళగిరిలోని డిప్యూటీ సీఎం కార్యాలయం వద్దకు రెండు కుంకీ ఏనుగులు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్.. కుంకీ ఏనుగులకు స్వాగతం పలికి, ఆహారం అందించారు. అనంతరం మన్యం జిల్లా గుచ్చిమి క్యాంపునకు ఏనుగులు పయనమయ్యాయి.గురువారం సాయంత్రమే పార్వతీపురం జిల్లాకు తరలించేందుకు ముసలిమడుగు క్యాంపు నుంచి రెండు కుంకీ ఏనుగులను అటవీ శాఖ అధికారులు లారీల్లో ఎక్కించారు.

నేటి శుభోదయ


జనరల్ న్యూస్

ఆదివారం -26 - జులై - 2026

## శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



ఒంగోలు, నేటి శుభోదయ ::: తొలి ఏకాదశి పర్వ దినంతో పాటు శనివారం కూడా కలిసి రావడంతో ఒంగోలు లోని కుర్తాళం శ్రీ సిద్దేశ్వరి పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దర్శనానికి భక్తులు పోటెత్తారు.తెల్లవారు ఝామునుండే వేల సంఖ్యలో భక్తులు భారీగా శ్రీవారి దర్శనానికి విచ్చేశారు. భక్త జన సందోహంతో క్యూ లైన్లు కిటకిటలాడాయి.భక్త జన ప్రవాహంతో శ్రీగిరి మరో దివ్య తిరుమలగా భాసించింది.భక్తుల గోవింద నామాలతో శ్రీగిరి ప్రతిధ్వనించింది. తొలి ఏకాదశి పర్వ దినాన్ని పురస్కరించుకుని శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి విశేష అలంకరణ చేశారు. ఆలయ అర్చకులు వేద పండితులు శ్రీవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలా దేవి కార్య నిర్వహణ ధర్మకర్త సి వి రామకృష్ణారావు ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వర రావు ఆలూరు లక్ష్మీ కుమారి ఆలూరు జై శంకర్ ఆలూరు కుమార ఆత్రేయ తదితరులు పర్యవేక్షించారు, భక్తులకు శ్రీవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.



## “శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయం అన్న సమారాధనకు ఆర్థిక సహాయం చేసిన వైసిపి ఇన్చార్జ్ వడ్డీ రఘురాం నాయుడు”




**పెంటపాడు జులై 25 (అవినాష్ మారంపూడి నేటి- శుభోదయ)**::: పెంటపాడు కోనేరు చెరువు గట్టు వద్ద వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ కామాక్షి దేవి అమ్మవారి ఆలయ తృతీయ వార్షికోత్సవ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ తృతీయ వార్షికోత్సవ మహోత్సవం సందర్భంగా 27.7.26 తేదీ సోమవారం ఉదయం 11 గంటల నుండి భారీ అన్న సంబరాధన జరుగుతుందని విశ్వబ్రాహ్మణ ఆలయ కమిటీ వారు తెలియజేశారు. ఈ భారీఅన్న సమారాధనకు తాడేపల్లిగూడెం వైసిపి ఇన్చార్జ్ వడ్డీ రఘురామ నాయుడు 10,000/-(పది వేల రూపాయలు) ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణ ఆలయ నిర్వహణ కమిటీ గౌరవ అధ్యక్షులు కొమ్మోజు బుచ్చిబాబు మాట్లాడుతూ మా భారీఅన్న సమారాధనకు విరాళం ఇచ్చిన వడ్డీ రఘురాం నాయుడుకు ప్రత్యేక కృతజ్ఞతలు కమిటీ తరఫున తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు ఎంపిటిసి సభ్యులు రెడ్డి సూరిబాబు, వైసిపి గ్రామ పార్టీ అధ్యక్షులు బర్ల జయ రాంబాబు, కొవ్వూరు భాస్కర్ రెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ కొవ్వూరి వరహారెడ్డి, కర్రి పృథ్వి కుమార్ రెడ్డి, కర్రీ శివారెడ్డి, మాజీ వార్డు మెంబర్లు మారంపూడి ఏసుదాసు, రెడ్డి శ్రీనివాస్, ఉంద్రాజవరపు రాజు విశ్వబ్రాహ్మణ ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులు కొమ్మోజు బుచ్చిబాబు, విశ్వబ్రాహ్మణ ఆలయ కమిటీ సభ్యులు రావిపాడు సత్యనారాయణ, బొంటెన బ్రహ్మాజీ, బొద్దురి పాపారావు బ్రదర్స్, ఎర్రోజి సుబ్రమణ్యం, మూసి నాని, శివ తదితరులు పాల్గొన్నారు.

## తూర్పు మన్యంలో మానవ హక్కుల సంఘ సభ్యుల నియామకం

- రాష్ట్ర డైరెక్టర్ గా సతీష్ రాఘవన్

- రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా వేగి రామకృష్ణ



**చింతూరు, నేటి శుభోదయ :::**తూర్పు మన్యంలో (హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా) మానవ హక్కుల పరిరక్షణ సమితి సంస్థ అవసరం ఎంతైనా ఉందని గుర్తించిన సంఘ నాయకులు తూర్పు మన్యంలోని పోలవరం జిల్లా చింతూరు మండలం మోతుగూడెం గ్రామం నుంచి రాష్ట్ర డైరెక్టర్ గా సతీష్ రాఘవన్ ను రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా వేగి రామకృష్ణను నియమిస్తూ జాతీయ అధ్యక్షులు తాళ్లూరి ప్రసన్న కుమార్ కాకినాడలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో గుర్తింపు కార్డు, నియామక పత్రాన్ని అందజేశారు, ఈ సందర్భంగా జాతీయ అధ్యక్షులు మాట్లాడుతూ గిరిజన ప్రాంతాలలో గిరిజనులు, బలహీనవర్గాల ప్రజల యొక్క సామాజిక హక్కులను తెలియజేస్తూ ఎవరికైతే సంస్థ యొక్క అవసరం ఉంటుందో వారికి తోడుగా ఉంటూ న్యాయం జరిగేలా చూడాలని ఈ సందర్భంగా తెలియజేశారు, ఈ కార్యక్రమంలో రాష్ట్ర పౌర సంబంధాల (స్టేట్ పబ్లిక్ రిలేషన్ చైర్మన్) అధ్యక్షులు బి భవానీ శంకర్, దక్షిణ భారతదేశ అధ్యక్షుడు (సౌత్ ఇండియా చైర్మన్) శ్రీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పుట్టుకతోనే ఎవ్వరు పరిశోదకులు కారని నిరంతర సాధనతోనే పరిశోదకులుగా మారతారు


-ప్రొఫెసర్ రాజశేఖర్ మౌళి



విజయవాడ, జులై 25(అజయ్ నారగాని - నేటి శుభోదయ ) పుట్టుకతోనే ఎవ్వరు పరిశోదకులు కారని, ఉత్సాహం పట్టుదల, నిరంతర సాధనతో పరిశోదకులుగా మారతారని ప్రొఫెసర్ డాక్టర్ పొట్లూరి రాజశేఖర్ మౌళి అన్నారు. శనివారం శ్రీ దుర్గా మల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల వాణిజ్య, మేనేజ్మెంట్ విభాగం కళాశాల ప్రాంగణంలో పబ్లిషింగ్ ఇంపాక్ట్ ఫుల్ స్కూపస్ అండ్ డబ్ల్యు ఓ ఎస్ ఇండెక్స్ అనే అంశం పై రెండు రోజుల పాటు నిర్వహించిన ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పొట్లూరి ప్రొఫెసర్ ఆఫ్ అంతర్జాతీయ జర్నల్స్ ఎలా పబ్లిష్ చేయాలో వివరిస్తూ ఎల్సివెర్ , స్ప్రింజర్ , ఏమిరాల్డ్ , క్యాంబ్రిడ్జి వంటి ప్రముఖమైన జర్నల్స్ లో ఎలా పబ్లిష్ చేయాలనే వాటిపై రివ్యూ సిస్టం ఎలా ఉంటుంది అనేది తెలియచేసారు.ఏదైనా జర్నల్ లేదా కాన్ఫరెన్స్ ఆర్టికల్ పబ్లిష్ చేసేముందు జర్నల్ లక్ష్యం, స్కోప్ మరియు ఆర్థర్ గైడెన్స్ మీద పూర్తిగా అవగాహన చేసుకుని తర్వాత ఈ జర్మలో మన ఆర్టికల్ సరిపోతుందా లేదా అని చూసుకొని పబ్లిష్ చేయాలని తెలియజేశారు. రీసెర్చ్ చెస్ కి ఒరిసిడ్ ఐడి అవసరమని అది ఎలా క్రియేట్ చేసుకోవాలో ప్రాక్టికల్ గా వివరించారు. ఒరిసిడ్ ఐడి అనేది స్కూపస్ మరియు వెబ్ ఆఫ్ సైన్సెస్ లో ఆర్టికల్స్ ని పబ్లిష్ చేయడానికి ఉపయోగపడుతుందని తెలిపారు.ముగింపు కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఇంచార్జ్ డాక్టర్ పివి దుర్గావతి మరియు కామర్స్ మేనేజ్మెంట్ మరియు ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ వి సంధ్యలక్ష్మి రిసోర్స్ పర్సన్ ప్రొఫెసర్ డాక్టర్ రాజశేఖర్ మౌళి పొట్లూరి ని సత్కరించారు. తన ప్రసంగంతో ఫడప్ కార్యక్రమంలో పాల్గొన్న వారి రీసెర్చ్ రంగంలో అవగాహన కల్పించి వారిలో ఉన్న అపోహలను తొలగించి ఈ రంగంలో ఆసక్తిని కలగజేసినందుకు ధన్యవాదాలు తెలియజేశారు.

# అత్యవసరంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు తో భేటీ అయిన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

**రాజానగరం నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ‘సీ.ఎం’ ని కోరిన ఎమ్మెల్యే ‘బత్తుల’**



**కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె);**రాజానగరం నియోజకవర్గ శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ శనివారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని మర్యాదపూర్వకంగా కలిసి, నియోజకవర్గంలోని పలు కీలక సమస్యలపై వినతిపత్రం అందజేశారు.ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించిన ముఖ్యాంశాలు - - కోరుకొండ దేవస్థానం ఇనాం భూముల సమస్యలు: కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన ఇనాం భూముల సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని కోరారు. రీ-సర్వే అనంతరం కోరుకొండ గ్రామంలో మిగిలిన భూములు సెక్షన్ 22-ూ(1)(జ) కింద దేవాదాయ శాఖ పేరున నమోదు కావడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇనాం రద్దు చట్టం-1956 ప్రకారం రైత్వారీ పట్టాలు పొందిన భూములు వ్యక్తిగత హక్కులుగా మారినప్పటికీ, వాటిని దేవాదాయ శాఖ ఆస్తులుగా చూపడం వల్ల భూముల అమ్మకాలు, రిజిస్ట్రేషన్లు, బ్యాంకు రుణాలు మరియు ప్రభుత్వ పథకాలు నిలిచిపోయాయి. ఇప్పటికే 259.20 సెంట్ల జిరాయితీ భూమిని సెక్షన్ 22-ూ నుండి తొలగించగా, మిగిలిన 795.22 సెంట్ల ఇనాం భూముల సమస్యను కూడా పరిష్కరించి రైతులకు శాశ్వత హక్కులు కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేస్తూ వినతి పత్రం అందజేశారు. - పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం -- రైతుల సమస్యలు: పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం కోసం భూములు ఇచ్చిన రైతులకు పెండింగ్లో ఉన్న నష్టపరిహారాన్ని ఆరు శాతం వడ్డీతో చెల్లించాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ గారు కోరారు. ఈ ప్రాజెక్ట్ కోసం 304 మంది చిన్న, సన్నకారు రైతులు 259 ఎకరాలు ఇచ్చినప్పటికీ, ఎనిమిది సంవత్సరాలు గడిచినా చాలామందికి నష్టపరిహారం అందలేదని, కోర్టులో అనుకూల తీర్పు పొందిన 28 మంది రైతులు కూడా చెల్లింపుల కోసం ఎదురుచూస్తున్నారని, అలాగే సెక్షన్ 22-ూ జాబితా నుండి మిగిలిన భూములను తొలగించి సబ్-డివిజన్ ప్రక్రియ పూర్తి చేయాలని రైతులు కోరుతున్నట్లు ఆయన వివరిస్తూ వినతి పత్రం అందజేశారు. కోరుకొండ శ్రీ లక్ష్మి నరసింహస్వామి ఆలయం టిటిడికి దత్తత: కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానాన్ని తిరుమల తిరుపతి దేవస్థానాలు ఆధీనంలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. 11వ--12వ శతాబ్దాలకు చెందిన ఈ ఆలయం ప్రతి సంవత్సరం 4 లక్షలకు పైగా భక్తులను ఆకర్షిస్తోందని, 2027లో జరగబోయే గోదావరి పుష్కరాల సమయంలో భక్తుల రాకపోకలు మరింత పెరగనున్నందున తక్షణ మౌలిక సదుపాయాల అభివృద్ధి అవసరమని తెలిపారు. టి.టి.డి. ఆధీనంలోకి తీసుకుంటే ఆలయ అభివృద్ధి వేగవంతం అవుతుందని మరియు భక్తుల సౌకర్యం మరింత పెరుగుతుందని తెలియజేస్తూ వినతి పత్రం అందజేశారు.

**కోరుకొండ శ్రీ లక్ష్మి నరసింహస్వామి ఆలయ రోడ్డు అభివృద్ధి**

కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన రహదారిని అభివృద్ధి చేసి విస్తరించాలని కోరారు. ఇందులో భాగంగా కోరుకొండ -- నాగంపల్లి రహదారి (కి.మీ 0/000 -- 1/700) విస్తరణ మరియు బలపరిచే పనులను తక్షణమే ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. ఈ రహదారి నిర్మాణానికి రూ.360 లక్షలు అంచనా వేయగా, ఈ రోడ్డు అభివృద్ధి చేయడం వల్ల రథోత్సవం సమయంలో రథం కదలికలో ఎదురయ్యే ఇబ్బందులను, ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. అలాగే 2027 గోదావరి పుష్కరాల సందర్భంగా విచ్చేసే భక్తుల రాకపోకలకు ఇది ఎంతగానో సౌకర్యంగా ఉంటుందని తెలియజేస్తూ వినతి పత్రం అందజేశారు.

**శ్రీరాంపురం నుండి పోలీస్ క్వార్టర్స్ రహదారి విస్తరణకు అటవీ భూమి:**

శ్రీరాంపురం -- పోలీస్ క్వార్టర్స్ రహదారి విస్తరణ మరియు అభివృద్ధి పనులను తక్షణమే ప్రారంభించాలని కోరారు. శ్రీరాంపురం నుండి రాజమహేంద్రవరం వరకు గల 5.200 కి.మీ. పొడవైన ఈ ప్రధాన జిల్లా రహదారి, చీ౨-16 మరియు దివాన్ చెరువు -- పుణ్యక్షేత్రం రోడ్లతో అనుసంధానం కలిగి ఉంది. రైతులు వ్యవసాయ ఉత్పత్తులను రవాణా చేయడానికి మరియు గ్రామీణ ప్రజలు నగరానికి చేరుకోవడానికి ఇది కీలక మార్గమని తెలిపారు.

**సీతానగరం పి.హెచ్.సి. భవనం మరమ్మత్తులు:**

శిథిలావస్థకు చేరిన సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (ౄ౨జ) భవన మరమ్మత్తు పనులకు రూ.27.50 లక్షలు కేటాయించాలని కోరారు. భవనం పైకప్పు లీకేజీ వలన రికార్డులు మరియు మందులు దెబ్బతింటున్నాయని, కిటికీలు పాడైపోయాయని, నాలుగు మరుగుదొడ్లు ఉపయోగించలేని స్థితిలో ఉన్నాయని తెలిపారు. అలాగే కాంక్రీట్ స్పాలింగ్, నీటి సరఫరా మరియు విద్యుత్ వ్యవస్థలు దెబ్బతినడం, కాంపౌండ్ వాల్ పాడైపోవడం, పెయింటింగ్ మసకబారడం వంటి సమస్యలు ఉన్నాయని వివరిస్తూ వినతి పత్రం అందజేశారు.

**ఎన్. డి.బి. రోడ్డు అభివృద్ధి పనుల వేగవంతం:**

రాజానగరం నియోజకవర్గంలో న్యూ డెవలప్మెంట్ బ్యాంక్ ఎన్. డి.బి. నిధులతో చేపట్టిన పలు రహదారి అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్న విషయాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తెచ్చారు.కాపవరం - ముగ్గళ్ల రోడ్డు: ఆర్.జి రోడ్డు నుండి ముగ్గళ్ల రోడ్డు వరకు (కి.మీ 0.000 నుండి కి.మీ 14.500 వరకు) వెడల్పు మరియు బలోపేతం చేయడం.చిన్నకొండేపూడి - చీపురుపల్లి రోడ్డు: రాపాక నుండి చిన్నకొండేపూడి రోడ్డు వరకు (కి.మీ 9.200 నుండి కి.మీ 17.645 వరకు) వెడల్పు మరియు బలోపేతం చేయడం.పై విషయాలపై సానుకూలంగా స్పందించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు త్వరితగతిన సమస్యలు పరిష్కరించాలని వారి కార్యదర్శి రాజమౌళి గారికి ఆదేశాలు జారీ చేయడం జరిగింది.

# గుడివాడ గౌరీశంకరపురంలో “అమోఘం” శాఖాహార హోటల్ ప్రారంభం

**-పద్మశ్రీ మురళీమోహన్ చేతుల మీదుగా “అమోఘం” హోటల్....ఎమ్మెల్యే రాము చేతుల మీదుగా డైనింగ్ ప్రారంభం-ఎన్టీఆర్ గడ్డ గుడివాడకు రావడం సంతోషం: మురళీమోహన్ -లాభం కంటే గుడివాడ పేరు నిలబడేలా హోటల్ నడపాలి: మురళీమోహన్ -బెజవాడ బాబాయ్ లా గుడివాడ అమోఘం ఫేమస్ కావాలి: మురళీమోహన్ -గుడివాడలో శాఖాహార హోటల్ కొరత తీరింది:ఎమ్మెల్యే రాము**



**గుడివాడ, జులై 25 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ )** ఎన్టీఆర్ ప్రాతినిధ్యం వహించిన గుడివాడకు రావడం తనకు ఎప్పుడూ సంతోషంగా ఉంటుందని తెలిపారు. విందు రెస్టారెంట్ ద్వారా ఇప్పటికే ప్రజల మన్ననలు పొందిన యువతరం, తిరిగి అమోఘం పేరుతో శాఖాహార భోజన హోటల్ ఏర్పాటు చేయడం అభినందనీయమని సినీనటుడు, పద్మశ్రీ మురళీమోహన్ అన్నారు.స్థానిక. గౌరీశంకరపురంలో నూతనంగా ఏర్పాటు చేసిన అమోఘం హోటలను ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ అందరికీ అందుబాటులో ఉండేలా శాఖాహార టిఫిన్ సెంటర్ ను గుడివాడ నడిబొడ్డున ఏర్పాటు చేశారని కొనియాడారు.ఆహార పదార్థాలను ముందుగానే పరీక్షించి, ప్రజల సూచనలు, మంచి ఆలోచనలతో ఈ హోటల్ ప్రారంభించడం అభినందనీయమని అన్నారు. హోటల్ నిర్వాహకులు లాభం కంటే గుడివాడ పేరు నిలబడేలా అమోఘం హోటల్ ను నడపాలని సూచించారు.బెజవాడలో బాబాయ్ హోటల్ ఎంత ఫేమస్ అయిందో, గుడివాడలో అమోఘం కూడా అంతే ఫేమస్ కావాలని ఆకాంక్షించారు. “అమోఘం” అంటే అద్భుతం అనే అర్థం వస్తుందని, ఇటీవల వ్యాపార టైటిల్స్ కూడా చాలా ప్రత్యేకంగా ఉంటున్నాయని తెలిపారు. హైదరాబాద్ లో “అహో” హోటల్ కూడా శ్రీకృష్ణదేవరాయల సాహిత్యం నుంచి వచ్చిందని ఉదాహరణ ఇచ్చారు.సిటీలో పెట్టే అవకాశం ఉన్నా గుడివాడపై ప్రేమతో స్థానికంగానే అనేక ప్రత్యేకతలతో హోటల్ ఏర్పాటు చేయడం గొప్ప విషయమని అన్నారు. ఈ రోజుల్లో ప్రజలు పది రూపాయలు ఎక్కువైనా సరే కల్తీ లేని ఆహారం తినాలని కోరుకుంటున్నారని, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని పూర్తి నాణ్యతతో అమోఘం సక్సెస్ కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని చెప్పారు. మంచి ఆలోచనతో హోటల్ ఏర్పాటు చేసిన పంచపాండవుల లాంటి ఐదుగురు యువతరాన్ని అభినందిస్తున్నానని మురళీమోహన్ పేర్కొన్నారు.

**ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ**

అమోఘం హోటల్ చాలా అమోఘంగా ప్రారంభమైందని అన్నారు. గుడివాడలో మంచి శాఖాహార హోటల్ లేదనే వెలితి ఎప్పటి నుంచో ఉండేదని తెలిపారు. ఇటీవల తాము వేసిన గౌరీశంకర్ పురం రోడ్డుకు మరింత అందం తెచ్చేలా, ఆహ్లాదకర వాతావరణంలో నాణ్యమైన ఆహారాన్ని అందించే అమోఘం హోటల్ ఏర్పాటు కావడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. మంచి ఆలోచనలతో వచ్చే యువతరాన్ని తాను ఎప్పుడూ ప్రోత్సహిస్తానని ఎమ్మెల్యే రాము హామీ ఇచ్చారు.మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరావు మాట్లాడుతూ గుడివాడ గౌరీశంకర్ సెంటర్ సెంటర్లో ఐదుగురు మిత్రులు కలిసి అమోఘం హోటల్ ఏర్పాటు చేయడం గొప్ప విషయమని, వారిని గుడివాడ ప్రజలు ప్రోత్సహించాలని కోరారు. సుపరిచితులు మురళీమోహన్ చేత హోటల్ ప్రారంభం కావడం మంచి శకునమని అన్నారు. గుడివాడలో మంచి హోటల్ కొరత ఎప్పటి నుంచో ఉందని, అమోఘం హోటల్ తో ఆ కొరత తీరుతుందని మాజీ మంత్రి పిన్నమనేని ఆశాభావం వ్యక్తం చేశారు.హోటల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో సీనియర్ టిడిపి నాయకులు పిన్నమనేని బాబ్జి, ఐఎంఎ నాయకులు మాగంటి శ్రీనివాస్, అమోఘం హోటల్ పార్ట్నర్స్ తుమ్మల శ్రీనివాస్, అడుసుమిల్లి శ్రీనివాస్, కొత్తూరు ప్రదీప్, ఫణి రాఘవేంద్ర గుప్తా,పొట్లూరి ఉదయ్, గుడివాడ పట్టణ ప్రముఖులు, పలు రాజకీయ పార్టీల నేతలు, వ్యాపార వాణిజ్య సంఘాల పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయ నిర్మాణానికి 70,000 విరాళం



యాడికి జూలై 25 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక :మండల కేంద్రంలోని హాస్పిటల్ కాలనీలో గల శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవాలయ నిర్మాణానికి తోరెడ్డి రామకృష్ణారెడ్డి గారి కుమారుడు తోరెడ్డి రాజారెడ్డి ?70,000 రూపాయల నగదును విరాళంగా అందజేశారు. గుడి నిర్మాణం శరవేగంగా జరుగుతున్న విషయాన్ని తెలుసుకున్న ఆయన, దైవకార్యంలో భాగస్వాములు కావాలనే ఉద్దేశంతో ఈ విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు .

ఈ సందర్భంగా మాట్లాడిన ప్రతినిధులు, దేవాలయ నిర్మాణానికి ఇచ్చే ప్రతి విరాళం దైవసేవలో చిరస్థాయిగా నిలిచిపోతుందని, భక్తితో చేసే దానం తరతరాలకు పుణ్యఫలాన్ని ఇస్తుందని పేర్కొన్నారు. విరాళం అందించిన రాజారెడ్డి కుటుంబ సభ్యులపై మల్లికార్జున స్వామివారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గుండా నాగరాజు, రామాంజనేయులు, కండ్లపల్లి రఘునాథ్, ఓబులేసు, ల్యాబ్ రామిరెడ్డి, గుండా దేవేంద్ర, కుండా లక్ష్మీనారాయణ, మంజునాథ్, శేఖర్, ఎర్రిస్వామి, మండ్ల సురేష్, గుండా నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు..

## శ్రీ జగన్మాత సన్నిధి లో భక్తుల రద్దీ

**విజయవాడ, జూలై 25 (నేటి శుభోదయ):**-శ్రీ కనకదుర్గమ్మ వారిని ఇంటి ఇలవేల్పుగా, ఆడపడుచుగా భావిస్తూ పసుపు, కుంకుమలు, గాజులు, చీర,సారెలతో ఇంద్ర కీలాద్రికి ఆషాఢ సారె 11వ రోజు శనివారం శ్రీ జగన్మాత సన్నిధిలో మహిళా భక్తుల రద్దీ పెరిగింది. సాయంత్రం 5 గంటల వరకు 48 సారె బృందాలు రాగా, 18 890 మంది భక్తులు సారెను సమర్పించారు. సారె బృందాలకు ఉచిత దర్శనంతో పాటు, ప్రసాదాలను దేవస్థానం వారు అందజేశారు..



## ఇంద్రకీలాద్రిపై వైభవంగా ‘ఆషాఢ సారె’ ఉత్సవాలు.

**ధర్మకర్తలమండలి సారె సమర్పణ**



**విజయవాడ, జూలై 25 (నేటి శుభోదయ):-**

శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో ఆషాఢ మాస ఉత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవంగా సాగుతున్నాయి.

ఆషాఢ మాస సారె సమర్పణ మహోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం దేవస్థానం ధర్మకర్తల మండలి తరఫున, ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ) ఆధ్వర్యంలో శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారికి ఆషాఢ సారెను సమర్పించారు. కొండపై ఉన్న కళావేదిక నుండి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్, ధర్మకర్తలు, వారి కుటుంబ సభ్యులు సాంప్రదాయబద్ధంగా పసుపు, కుంకుమలు, పూలు, పండ్లు, గాజులు, చీర, నూతన వస్త్రాల సారె సంభారాలను నెత్తిన పెట్టుకుని ఊరేగింపుగా ఆలయానికి విచ్చేశారు.రాజగోపురం వద్దకు చేరుకున్న చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), వారి కుటుంబ సభ్యులకు ఆలయ ఈవో వి.కె. శీనా నాయక్, ఆలయ అధికారులు మంగళవాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ ఘనస్వాగతం పలికారు. అనంతరం వారిని ఆలయ మర్యాదలతో శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి దర్శనానికి తోడ్కొని వెళ్లారు.

శ్రీ అమ్మవారి మూలవిరాట్ దర్శనం పొందిన అనంతరం, ధర్మకర్తల మండలి సభ్యులు మహామండపం 6వ అంతస్తులో ప్రతిష్టించిన ఉత్సవమూర్తి అమ్మవారి ముందు సారె సంభారాలను సమర్పించి పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా వేద పండితులు, అర్చక స్వాములు వారికి వేదఆశీర్వచనం అందజేసి, అమ్మవారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలను అందజేసారు.

ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు,ఆలయ అధికారులు, వైదిక సిబ్బంది , పరిపాలనా సిబ్బంది పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య నిర్వహణ, డ్రైన్ల డీ-సిల్టింగ్ పనులను నిరంతరం పర్యవేక్షించాలి విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర



**విజయవాడ, జూలై 25 (నేటి శుభోదయ):-** పారిశుద్ధ్య నిర్వహణ, డ్రైన్ల డీ-సిల్టింగ్ పనులను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. శనివారం ఉదయం తన పర్యటనలో భాగంగా ఏలూరు రోడ్, బందర్ రోడ్, ఇన్నర్ రింగ్ రోడ్, నూజివీడు రోడ్, బీఆర్టీఎస్ రోడ్, గులాబీతోట, పిన్నమనేని పాలీక్లినిక్ రోడ్ ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరాన్ని ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచేందుకు అధికారులు నిరంతరం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా 33 వెంట్స్ వద్ద ఉన్న అవుట్‌ఫాల్ డ్రెయిన్‌ను డ్రోన్ తో పరిశీలించి, అందులో పేరుకుపోయే గుర్రపు డెక్కలు, ఇతర వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. వర్షపు నీటి ప్రవాహానికి ఎటువంటి అంతరాయం కలగకుండా ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. శాఖధిపతులు డ్రోన్ వినియోగాన్ని విస్తృతంగా చేపట్టాలని అన్నారు. కేవలం ప్రధాన డ్రైన్లకే పరిమితం కాకుండా నగరంలోని చిన్న, మధ్యతరహా, ప్రధాన డ్రైన్లన్నింటిలోనూ డీ-సిల్టింగ్ పనులు నిరంతరం చేపట్టి, కూడికలు తొలగిస్తూ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం గులాబీతోటలోని అన్నా క్యాంటీన్‌ను కమిషనర్ పరిశీలించారు. క్యాంటీన్‌కు వచ్చే ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆహార నాణ్యత, పారిశుద్ధ్య నిర్వహణ అత్యున్నత ప్రమాణాలతో ఉండాలని సూచించారు. తాగునీరు, వినియోగ నీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, క్యాంటీన్‌లో ఏదైనా సమస్య తలెత్తిన వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ (ఇన్‌చార్జి) డాక్టర్ గోపాల నాయక్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గోపాల కృష్ణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

# గుడివాడలో కైకాల సత్యనారాయణ 91వ జయంతి వేడుకలు

**-నివాళులర్పించిన పద్మశ్రీ మురళీమోహన్, ఎమ్మెల్యే రాము-కాపు సేవా సమితి, కళాకారుల ఆధ్వర్యంలో వేడుకలు.-మురళీమోహన్ కు కాపు సేవా సమితి, కళాకారుల సన్మానం.-తొలి ఏకాదశి రోజు కైకాలకు నివాళి అర్పించడం సంతోషం:మురళీమోహన్ -కైకాలతో కుటుంబ, స్నేహ బంధం ఉంది: మురళీమోహన్-అన్ని పాత్రలకు జీవం పోసిన ఆల్రౌండర్ కైకాల: మురళీమోహన్ -కైకాల లాంటి మహానటుడు గుడివాడలో పుట్టడం గర్వకారణం:ఎమ్మెల్యే రాము**



గుడివాడ జూలై 25 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) తెలుగు సినీ రంగంలో అన్ని పాత్రలకు జీవం పోసిన ఆల్ రౌండర్ లాంటి నటుడు స్వర్గీయ కైకాల సత్యనారాయణ అని మాజీ పార్లమెంట్ సభ్యుడు పద్మశ్రీ మాగంటి మురళీమోహన్ కొనియాడారు. కైకాల పుట్టిన గుడివాడ గడ్డపై ఆయన జయంతి వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని మురళీమోహన్ హర్షం వ్యక్తం చేశారు. నవ నట సార్వభౌముడు స్వర్గీయ కైకాల సత్యనారాయణ 91వ జయంతి వేడుకలు గుడివాడ కాపు సేవా సమితి మరియు పట్టణ కళాకారుల శనివారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో మాజీ పార్లమెంట్ సభ్యుడు, పద్మశ్రీ మాగంటి మురళీమోహన్, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పాల్గొన్నారు. ఓల్డ్ మున్సిపల్ కార్యాలయ సెంటర్లో గల కైకాల సత్యనారాయణ విగ్రహానికి మురళీమోహన్, ఎమ్మెల్యే రాము మరియు కూటమి నాయకులు పూలమాలలతో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జోహార్ కైకాల అంటూ మురళీమోహన్ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సేవాసమితి పెద్దలు, కళాకారులు , మరియు గుడివాడ టిడిపి అధ్యక్షుడు పంద్రాజు సాంబయ్య మురళీమోహన్ కు గౌరవ సన్మానం చేశారు. అనంతరం మురళీమోహన్ మీడియాతో మాట్లాడుతూ పవిత్రమైన తొలి ఏకాదశి రోజు గుడివాడకు రావడం, తనకు ఎంతో ఆప్తుడైన కైకాల సత్యనారాయణకు నివాళి అర్పించడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. కైకాలతో తనకు కుటుంబ బంధాలు, స్నేహ సంబంధాలు ఉన్నాయని పేర్కొన్నారు. కైకాల తాత, తన తాత కౌతవరంలో మంచి స్నేహితులని గుర్తుచేశారు. షూటింగ్ లేని సమయంలో కైకాలతో తాను అనేకసార్లు కలుసుకునేవాడినని చెప్పారు. సినీ రంగంలో బాగా రాణిస్తున్నావని అభినందిస్తూ కైకాల తనకు మూడు ముఖ్యమైన సూత్రాలు నేర్పారని వివరించారు. షూటింగ్ సమయంలో వేషాలు లేక వచ్చే సీనియర్ నటులను గౌరవించి, మర్యాద చేయాలని, షూటింగ్ విరామ సమయంలో విహారయాత్రలకు వెళ్లకుండా, ప్రొడ్యూసర్లకు టచ్ లో ఉండి డబ్బింగ్ ఉందా, షూటింగ్ ప్యాచ్ వర్క్ ఉందా అని అడగాలని చెప్పారని తెలిపారు. మూడవ సూత్రం డబ్బు ఇస్తే గానీ షూటింగ్ కు రాను అని ప్రొడ్యూసర్ తో ఎప్పుడూ అనవద్దని కైకాల హితవు పలికారని పేర్కొన్నారు. కొందరు ప్రొడ్యూసర్లు భార్య మెడలో పుస్తెలు అమ్మి మరీ సినిమాలు తీస్తారని, అలాంటి వారిని గౌరవించాలని కైకాల తనకు చెప్పారని గుర్తుచేశారు. ఎన్నో సినిమాల్లో కలిసి నటించిన కైకాల తనకు ఎంతో మంచి మిత్రుడని, ఆయన పుట్టిన గుడివాడలో నేడు ఆయన విగ్రహానికి నివాళులర్పించుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. చివరి దశలో అనారోగ్యంతో ఉన్నప్పుడు కైకాలను కలిసినప్పుడు ఆయన పేరుపేరునా ప్రతి ఒక్కరి గురించి అడిగారని నాటి రోజులను గుర్తుచేసుకున్నారు. అన్న ఎన్టీఆర్ అంటే తనకు, కైకాలకు ఎన్నలేని ప్రేమ ఉండేదని పేర్కొన్నారు. అన్ని పాత్రలకు జీవం పోసిన కైకాల ఆల్రౌండర్ లాంటి నటుడని, యముడు పాత్ర పేటెంట్ కైకాలదే అని మురళీమోహన్ కొనియాడారు.

ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ

కైకాల సత్యనారాయణ లాంటి మహానటుడు గుడివాడ గడ్డపై పుట్టడం మాకు గర్వకారణమని అన్నారు. ఆయన సేవలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని ఎమ్మెల్యే రాము కోరారు. జయంతి వేడుకల్లో మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, స్వర్గీయ కైకాల సత్యనారాయణ జయంతి సభలో పాల్గొన్న ముఖ్యులు. శ్రీ ప్రభాకర నాట్యమండలి ప్రధాన కార్యదర్శి మట్టా రాజా, చార్లీ చాప్లిన్ కామెడి క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు నరహరిశెట్టి ప్రసాద్, కార్యదర్శి వంగా శ్రీనివాస్,(వంశీ), కాపు సేవా సమితి వ్యవస్థాపకులు పొన్నూరు రామకృష్ణ, సేవా సమితి కార్యదర్శి ఆత్మూరి మల్లేశ్వరరావు, మాజీ అధ్యక్షులు సుంకర గాంధీ,సనకా సుబ్బారావు, రమణారావు,టిడిపి నాయకులు పిన్నమనేని బాబ్జి, పంద్రాజు సాంబయ్య,లింగం ప్రసాద్, చేకూరు జగన్మోహన్రావు, పైడిముక్కల వంశీ, జనసేన నాయకులు సాయన రాజేష్,పేర్ని జగన్, పలువురు కూటమి నాయకులు , కళాకారులు పాల్గొన్నారు.

# కృష్ణాజిల్లా నీతివంతులకు, నిజాయతీపరులకు మారుపేరు

**- సినీనటుడు, పద్మశ్రీ మురళీమోహన్**

**-ఐ లవ్ గుడివాడ సింబల్ వద్ద... విక్టరీ చూపిస్తూ హర్షం వ్యక్తం చేసిన మురళీమోహన్ -నీట్ లీకేజీని సరిదిద్దేందుకు ప్రధాని మోడీ సిద్ధం: మురళీమోహన్-గొప్ప వ్యక్తి మురళీమోహన్ కు పద్మశ్రీ రావడం గర్వకారణం: ఎమ్మెల్యే రాము-మురళీమోహన్ మా తరానికి ఆదర్శప్రాయుడు, స్ఫూర్తి దాత: ఎమ్మెల్యే రాము**

గుడివాడ జులై 25 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ) కృష్ణాజిల్లా అంటే నీతిమంతులు, నిజాయితీపరులైన నాయకులకు నిలయంగా ఉండేదని మాజీ పార్లమెంట్ సభ్యుడు పద్మశ్రీ మాగంటి మురళీమోహన్ పేర్కొన్నారు. తెలుగుజాతికి రెండు కళ్ళు లాంటి ఎన్టీఆర్, ఏఎన్నార్ నడయాడిన గుడివాడ గడ్డ రావడం సంతోషకరమని ఆయన హర్షం వ్యక్తం చేశారు. గుడివాడ పర్యటనలో భాగంగా ఏలూరు రోడ్డులోని టీడీపీ కార్యాలయం ప్రజావేదికకు మాజీ పార్లమెంట్ సభ్యులు, పద్మశ్రీ మాగంటి మురళీమోహన్ శనివారం విచ్చేశారు. ముందుగా ఏజికే స్కూల్ సెంటర్లోని ఐ లవ్ గుడివాడ వద్ద ఎమ్మెల్యే రాముతో కలిసి ఫోటోలు దిగిన మురళీమోహన్ విక్టరీ సింబల్ చూపిస్తూ ఐ లవ్ గుడివాడ అన్నారు. గుడివాడను ప్రేమించే రాము లాంటి మంచి వ్యక్తి ఎమ్మెల్యేగా ఉండడం మంచి విషయం అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ప్రజావేదికను కూల్చివేయడంతో దానికి గుర్తుగా గుడివాడలో ప్రజావేదిక ఏర్పాటు చేశామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మురళీమోహన్ కు వివరించారు. నాటి విధ్వంసం, ఘోరాలను ఇప్పటికీ మర్చిపోలేకపోతున్నామని మురళీమోహన్ ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే రాము కార్యాలయంలో కూటమి నాయకులతో మురళీమోహన్ కొద్దిసేపు ముఖాముఖి



మాట్లాడారు. ఈ సందర్భంగా కూటమి శ్రేణులు మురళీమోహన్ తో ఫోటోలు దిగి పలకరించారు. జనసేన యువతతో మాట్లాడుతూ రాష్ట్రంలో పవన్ కళ్యాణ్ కు చంద్రబాబు ఎంత ప్రాధాన్యత ఇస్తున్నారో, గుడివాడలో మీకు ఎమ్మెల్యే రాము అంతే ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ఇప్పుడు వచ్చిన మెజార్టీ కంటే ఎక్కువ రావడానికి కృషి చేయాలని వారికి సూచించారు.

### ఈ సందర్భంగా మురళీమోహన్ మాట్లాడుతూ

కృష్ణా జిల్లా నీతివంతులు, నిజాయితీపరులు, స్వచ్ఛమైన రాజకీయ నాయకులకు మారుపేరని, సొంత డబ్బు ఖర్చు చేసే పిన్నమనేని కోటేశ్వరరావు లాంటి నాయకులు ఎందరో ఇక్కడ ఉన్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో గుడివాడ అసెంబ్లీ నియోజకవర్గం ఎంతో ముఖ్యమైనదని, గుడివాడలో ఎవరు గెలిస్తే అదే పార్టీ రాష్ట్రంలో గెలుస్తుందనే నానుడి ఉందని తెలిపారు. అలాంటి నియోజకవర్గానికి మంచి అభ్యర్థిని పార్టీ ఎంపిక చేస్తుందని అందరూ ఎదురుచూశామని, ఆ ప్రయత్నంలోనే ఎన్నారై అయిన రాము లాంటి మంచి వ్యక్తికి టికెట్ ఇచ్చిందని అన్నారు. టికెట్ ఇవ్వగానే తాను ఫోన్ చేసి అభినందించానని, ప్రెస్టేజ్ సీటు గెలవాలని శుభాకాంక్షలు చెప్పానని గుర్తుచేశారు. ఎంతో కష్టపడి పనిచేసిన రాము అందరి మన్ననలతో గెలిచారని కొనియాడారు.

### ఎన్టీఆర్, ఏఎన్నార్ నడయాడిన గుడివాడకు రావడం ఆనందంగా ఉందని చెప్పారు.

నీట్ పేపర్ లీకేజీపై స్పందిస్తూ విద్యార్థులకు అన్యాయం జరిగినప్పుడు అందరం ఖండించాల్సిందేనని అన్నారు. కష్టపడి చదివిన విద్యార్థులు పేపర్ లీక్ వల్ల నష్టపోవడం దారుణమని పేర్కొన్నారు. జరిగిన పొరపాట్లను సరిదిద్దుకోవడానికి ప్రధాని మోడీ సిద్ధంగా ఉన్నారని, ఈ విషయాన్ని ఆయన వీడియో సందేశం ద్వారా ఇప్పటికే తెలిపారని వివరించారు. పార్లమెంట్ లో కఠిన చట్టాలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. విద్యార్థుల ఉద్యమాన్ని రాజకీయం చేయడం సరికాదని, సమస్యను సామరస్యంగా పరిష్కరించుకొని విద్యార్థులు ముందుకు వెళ్లాలని సూచించారు. రాజకీయ ఉచ్చులో పడితే విద్యార్థులే నష్టపోతారని హెచ్చరించారు. రాజకీయాల్లో బిజీగా ఉండటంతో జయభేరి బ్యానర్ పై సినిమాలు చేయడం లేదని, అయితే ఇప్పుడు ట్రెండ్, సినిమాలు తీసే పద్ధతులు మారిపోయాయని తెలిపారు. తనకు పద్మశ్రీ అవార్డు రావడం సంతోషకరమని, భారత ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఎందరో రాజకీయ ఉద్దండులకు కృష్ణాజిల్లా నిలయమని ముగించారు.

### ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ

చంద్రబాబు వచ్చిన అయిదు రోజుల తర్వాత ఆంధ్రులు అభిమానించే మురళీమోహన్ గుడివాడ రావడం సంతోషంగా ఉందని అన్నారు. ఆయనకు పద్మశ్రీ రావడం తెలుగువారికి గర్వకారణమని పేర్కొన్నారు. చిన్నప్పటి నుంచి సినిమాల్లో చూసిన మహనీయుడు మురళీమోహన్ అని, నటుడిగా మాత్రమే కాకుండా రాజకీయ, వ్యాపార, నిర్మాణ రంగాల్లో సక్సెస్ అయ్యారని కొనియాడారు. మురళీమోహన్ తమ అందరికీ ఆదర్శప్రాయుడు, స్ఫూర్తి దాత అని ఎమ్మెల్యే రాము అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, సీనియర్ టిడిపి నాయకులు లింగం ప్రసాద్, పిన్నమనేని బాబ్జి, చేకూరు జగన్ మోహన్ రావు, పట్టణ టిడిపి అధ్యక్షుడు పంద్రాజు సాంబయ్య, కార్పొరేషన్ డైరెక్టర్ మజ్జాడ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.







## సమస్యలు పరిష్కరిస్తాం. సంక్షేమ పథకాలను అందిస్తాం

ఎమ్మెల్యే గద్దె




**విజయవాడ, జూలై 25 (నేటి శుభోదయ):-** ప్రజల సమస్యల పరిష్కారంతో పాటుగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తామని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. శనివారం ఉదయం తూర్పులోని ఎమ్మెల్యే కార్యాలయం లో ప్రజాదర్బార్ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే గద్దె రామమోహన్ హాజరై ప్రజల నుంచి వివిధ సమస్యలపై వినతిపత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు తెలియజేసిన ప్రతి సమస్యను పరిష్కరించడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు ప్రతి వారం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ప్రజలు తెలియజేసిన ప్రతి సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజా సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించడం అనేది ప్రభుత్వ బాధ్యత అన్నారు. అందువల్ల ప్రజలు ఈ ప్రజాదర్బార్ కార్యక్రమానికి వచ్చి వారి సమస్యలను తెలియజేయాలని గద్దె కోరారు. అంతేకాకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందక పోయినా ప్రజలు ఈ ప్రజాదర్బార్‌కు వచ్చి తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. అధికారులతో మాట్లాడి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూస్తానని ఎమ్మెల్యే గద్దె చెప్పారు. ఈ కార్యక్రమంలో ముమ్మనేని ప్రసాద్, టీడీపీ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు చలసాని రమణ,నందిపాటి దేవానంద్, బాశంశెట్టి రవి, కర్ణ రమేష్, తాతారావు, కొత్తపల్లి దుర్గాప్రసాద్, ఏసీపీ మోహన్‌బాబు, ట్రాఫిక్ సీఐ డీవీ.రమణ, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## కాపు జాతి హక్కుల కోసం జీవితాంతం పోరాడిన మహానేత ముద్రగడ్డ పద్మనాభం కు పార్టీలకు అతీతంగా ప్రజా ప్రతినిధుల ఘన నివాళులు




**విజయవాడ, జూలై 25 (నేటి శుభోదయ):-** గుంటూరులో కాపు జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ముద్రగడ్డ పద్మనాభం సంస్మరణ సభలో సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పాల్గొని మహానేత ముద్రగడ్డ పద్మనాభం కు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఉమా మాట్లాడుతూ ముద్రగడ్డ పద్మనాభం మరణం కాపు జాతికి తీరని లోటని, కాపు సామాజిక వర్గం హక్కులు, ఆత్మగౌరవం, అభ్యున్నతి కోసం ఆయన చివరి శ్వాస వరకు అహర్నిశలు పోరాడిన మహానేత అని కొనియాడారు, మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేగా అనేక పదవులు నిర్వహించినప్పటికీ, వ్యక్తిగత ప్రయోజనాల కంటే సమాజ హితానికే ప్రాధాన్యత ఇచ్చిన నాయకుడిగా ఆయన చిరస్థాయిగా నిలిచిపోతారని. కాపు రిజర్వేషన్లు, విద్యా అవకాశాలు, రాజకీయ ప్రాధాన్యత, సామాజిక న్యాయం వంటి అంశాలపై ముద్రగడ్డ పద్మనాభం ఎన్నో ఉద్యమాలు చేసి ప్రభుత్వాల దృష్టిని ఆకర్షించారని గుర్తు చేశారు. ఆయన చేసిన త్యాగాలు, పోరాట స్ఫూర్తి భావితరాలకు ఆదర్శంగా నిలుస్తాయని ఉమా అన్నారు. కాపు సామాజిక వర్గానికి సంబంధించిన న్యాయమైన డిమాండ్లను పార్టీ అధిష్ఠానం, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు తన వంతు కృషి చేస్తానని బొండా ఉమా స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య పద్ధతుల్లో, శాంతియుతంగా హక్కుల సాధన కోసం అందరూ ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. త్వరలో విజయవాడలో మహానేత ముద్రగడ్డ పద్మనాభం విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఈ సందర్భంగా ఉమా వెల్లడించారు. ఆ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని ఆయనకు ఘనంగా నివాళులర్పించాలని కోరారు. చివరగా, “జోహార్ వంగవీటి మోహనరంగా... జోహార్ ముద్రగడ్డ పద్మనాభం గారు...” అంటూ మహానేతలకు నివాళులర్పించారు.

## సీఎంఆర్ఎఫ్ ఎల్.ఓ.సి అందజేత.

# 3.07 లక్షల వైద్యసాయం మంజూరు




**విజయవాడ, జూలై 25 (నేటి శుభోదయ):-** ప్రజల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఆర్థిక ఇబ్బందులతో ఎవరూ వైద్య చికిత్సలకు దూరం కాకుండా ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా అవసరమైన వారికి అండగా నిలుస్తోందని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు అన్నారు. జి.కొండూరు మండలం, కట్టుబడిపాలెం (ఆర్) గ్రామానికి చెందిన శ్రీమతి సుద్దపల్లి లక్ష్మి సరోజిని కు 3,07,410ల విలువైన సీఎంఆర్ఎఫ్ ఎల్.ఓ.సిని మంజూరు చేసింది. ఈ ఎల్.ఓ.సిని శనివారం గొల్లపూడిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణప్రసాదు మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఖరీదైన వైద్య చికిత్సలు భారంగా మారకుండా రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందిస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజలకు అవసరమైన సేవలను వేగవంతంగా అందించడమే తమ లక్ష్యమని, నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి అవసరం వచ్చినా ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎల్.ఓ.సి మంజూరుకు సహకరించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా తొలి ఏకాదశి వేడుకలు ఆలయాలకు పోటెత్తిన భక్తులు



యాడికి జూలై 25 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక :హిందువులకు అత్యంత పవిత్రమైన తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని యాడికి మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వామి దేవాలయంతో పాటు శ్రీ పాండురంగ స్వామి ఆలయాలలో భక్తుల జనసందోహంతో కిటకిటలాడాయి. ఈ శయని ఏకాదశి నాడే శ్రీమహావిష్ణువు క్షీరాబ్ధిలో యోగనిద్రలోకి వెళ్తాడనే నమ్మకంతో, స్వామివారి కృపాకటాక్షాల కోసం తెల్లవారుజాము నుంచే స్థానిక భక్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు విశేష సంఖ్యలో ఆలయాలకు తరలివచ్చారు. తోలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రాంగణాలను సువాసనల పుష్పాలు, తోరణాలు మరియు రంగురంగుల విద్యుత్ దీపాలతో అత్యంత మనోహరంగా అలంకరించారు. ఉదయాన్నే అర్చకస్వాములు సుప్రభాత సేవతో ప్రారంభించి, స్వామివార్లకు పంచామృత అభిషేకాలు, సహస్రనామార్చన మరియు ప్రత్యేక తులసీదళ అలంకరణలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వామివారి దివ్యరూప దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ ప్రాంగణాలు “గోవిందా.. గోవిందా..” నామస్మరణలతో మారుమోగాయి. భక్తులు క్రమశిక్షణతో క్యూలైన్లలో వేచి ఉండి, స్వామివార్లను దర్శించుకుని తమ మొక్కుబడులు చెల్లించుకున్నారు. రోజంతా ఉపవాస జాగరణలు ఉండే భక్తులు ఆలయాల్లో భజనలు, నామసంకీర్తనల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పాండురంగ స్వామి ఆలయంలో కూడా ఏకాదశి ప్రత్యేక పూజలు అత్యంత వైభవంగా జరిగాయి. దర్శనం అనంతరం భక్తులందరికీ ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఎలాంటి అసౌకర్యం, తోపులాటలు జరగకుండా ఆలయ కమిటీ సభ్యులు, సేవా సంస్థల ప్రతినిధులు మరియు పోలీసులు ప్రత్యేక రక్షణ చర్యలు, మంచినీటి సదుపాయాలు ఏర్పాటు చేశారు..

# టీ టైమ్ విత్ స్టూడెంట్స్ యువత స్వరమే మన బలం..



**అనంత పురం బ్యూరో జూలై 25 నేటి శుభోదయ :**అనంత పురం ఎస్కేయూ , రాప్తాడు నియోజకవర్గానికి చెందిన విద్యార్థులు, యువతతో కలిసి మాజీ ఎమ్మెల్యే, రాప్తాడు నియోజకవర్గ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి “టీ టైమ్ విత్ స్టూడెంట్స్” కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, యువతతో ప్రకాష్ రెడ్డి ఆత్మీయంగా ముఖాముఖి సమావేశమై, రాష్ట్రంలో నెలకొన్న తాజా పరిస్థితులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న విద్యా సమస్యలు, నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ఉపాధి అవకాశాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉన్నత విద్య, పోటీ పరీక్షలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. విద్యార్థులు తమ అభిప్రాయాలు, సమస్యలు, ప్రభుత్వంపై ఉన్న ఆశలు, సూచనలను నేరుగా ప్రకాష్ రెడ్డి తో పంచుకోగా, ప్రతి సమస్యను ఓపికగా విన్న ఆయన, వాటి పరిష్కారం కోసం పార్టీ తరఫున నిరంతరం పోరాడుతామని భరోసా ఇచ్చారు. విద్యార్థుల అభిప్రాయాలను తెలుసుకోవడం, వారి భవిష్యత్తుకు అవసరమైన చర్యలపై సూచనలు స్వీకరించడం ఈ సమావేశం ప్రధాన ఉద్దేశ్యంగా సాగింది. అనంతరం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ నెల 28వ తేదీన నిర్వహించనున్న నిరసన కార్యక్రమంలో విద్యార్థులు, నిరుద్యోగ యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. డీఎస్సీ నిర్వహణలో చోటుచేసుకున్న అక్రమాలు, నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలు, నిరుద్యోగ భృతి అమలు, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల వంటి సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు, నిరుద్యోగ యువత హక్కుల కోసం మన గొంతును గట్టిగా వినిపిద్దామని, ఈ ప్రజాస్వామ్య పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి పిలుపునిచ్చారు.

## కడియపులంక శ్రీ ముసలమ్మ తల్లి ఆలయంలో
# ఆషాఢ శాకాంబరీ విశేష అలంకరణ..!

**– భక్తులతో కిటకిటలాడిన ఆలయం.. ప్రత్యేక పూజలు, ప్రసాదాల పంపిణీ..**

**– ఆషాఢ శుక్ర,శని వారాలకి శాకాంబరీ శోభ..!!**



**రాజమహేంద్రవరం, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె);** ఆషాఢ మాసం శుక్రవారం శుభ సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా కడియపులంక గ్రామదేవత శ్రీ ముసలమ్మ అమ్మవారి ఆలయం ఆధ్యాత్మిక శోభతో కళకళలాడింది. శుక్రవారం, శనివారం రెండు రోజుల పాటు విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారికి నిత్యం అలంకార సేవలు నిర్వహించే బ్రహ్మశ్రీ రమేష్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారిని శాకాంబరీ దేవి రూపంలో అత్యంత వైభవంగా ప్రత్యేకంగా అలంకరించారు. పండ్లు, కూరగాయలు, పుష్పాలతో చేసిన ఈ విశిష్ట అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఆషాఢ మాసం సందర్భంగా ఉదయం నుంచే ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదమంత్రోచ్చారణల నడుమ జరిగిన పూజా కార్యక్రమాలు భక్తి భావాన్ని మరింత పెంపొందించాయి. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడగా, అమ్మవారి దర్శనానికి మహిళలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. సాయంత్రం ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో అంబటి త్రిమూర్తులు -- నాగలక్ష్మి దంపతులు పాల్గొని అమ్మవారికి విశేష సేవలు సమర్పించారు. అనంతరం అష్టమంగళ హారతులు సమర్పించి కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా అంబటి త్రిమూర్తులు భక్తులందరికీ అమ్మవారి ప్రసాదాలతో పాటు ఫలహారాలను పంపిణీ చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు సక్రమంగా నిర్వహించగా, రెండు రోజుల పాటు జరిగిన ఈ శాకాంబరీ దేవి ప్రత్యేక అలంకరణను తిలకించేందుకు పరిసర గ్రామాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తిశ్రద్ధల మధ్య జరిగిన ఈ వేడుక కడియపులంక గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పింది. ఈ సందర్భంగా ఆ ప్రాంతశీ భక్తజనంతో కోలాహలంగా మారింది.

## మైనార్టీ అధ్యక్షులు దాదా గాంధీ ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ




**అనంతపురం,జూలై 25 నేటి శుభోదయ :** ధర్మేంద్ర ప్రధాన్ బాధ్యత తీసుకొని రాజీనామా చేసిన సందర్భంగా విజయోత్సవ ర్యాలీ నిర్వహించబడింది. రాష్ట్ర కాంగ్రెస్ మైనారిటీ అధ్యక్షులు శాలి దాదా గాంధీ నేతృత్వంలో అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో ఈ ర్యాలీ చేపట్టారు. ర్యాలీలో మహాత్మా గాంధీ విగ్రహానికి పూల మాలలు సమర్పించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శాలి దాదా గాంధీ మీడియా తో మాట్లాడుతూ -- ఆర్ఎస్ఎస్ మనువాద భావజాలంతో ప్రజలను మోసం చేస్తున్న బిజెపి ప్రభుత్వంపై యువత, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, దేశ ప్రజలు ఏకమైనారని, దీని ఫలితంగా క్యాబినెట్‌లో రాజీనామాలు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. నరేంద్ర మోడీకి ప్రజలు అల్టిమేటం ఇస్తున్నారని, ఇండియా కూటమి పార్టీలు (ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీ నేతృత్వంలోని ఉద్యమం) మద్దతు వల్ల ప్రధాని నివాసం నేపథ్యంలో తీసుకున్న అనూహ్యమైన నిర్ణయం వెనక్కి తీసుకోబడిందని అన్నారు. ఈ విజయానికి మద్దతు తెలిపిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, దేశ ప్రజలు, ఉద్యమంలో పాల్గొన్న యువత, రాజకీయ పార్టీలు, కుటుంబ సభ్యులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఐక్యతే నిజమైన శక్తి అని, ఇలాంటి ఉద్యమాలు కొనసాగాలని పిలుపునిచ్చారు. ర్యాలీలో పాల్గొన్నవారుసాకే శంకర్ (రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షులు), శర్మ షోలి (జిల్లా మైనారిటీ అధ్యక్షులు), ఓబులేష్ (ఎన్ఎస్ జిల్లా అధ్యక్షులు), నవాబ్ జాకీ హుస్సేన్ (మైనారిటీ వర్కింగ్ ప్రెసిడెంట్), జాన్ వెస్లీ (రాయలసీమ అధికారి ప్రతినిధి), హరి రాయల్ (ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు) తదితరులు పాల్గొన్నారు.

## "ఎన్‌డీఏ కూటమి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ప్రజా ఫిర్యాదుల స్వీకరణ"



తాడేపల్లిగూడెం జులై 25 (అవినాష్ మారంపూడి నేటి–శుభోదయ):::: ఎన్‌డీఏ కూటమి ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం నియోజకవర్గ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రతిరోజూ నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల (గ్రీవెన్స్) కార్యక్రమంలో భాగంగా ఈరోజు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించి వారి సమస్యలను ఓర్పుగా ఆలకించి సంబంధిత అధికారులతో చర్చించి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు బొలిశెట్టి రాజేష్ ,స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్,జనసేన పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు నీలపాల దినేష్ యాదవ్,పిడుగు మోహన్ బ్రదర్స్, నాని,గురజాల శ్రీనివాస్, గుడ్ల కుమార్ తదితర ఎన్‌డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఈ నెల 27న 'ఇంటింటికీ తెలుగుదేశం' ప్రచారం..!

**తండ్రి బాటలో తనయుడు గౌతమ్ ..!**



**మాచర్ల: ఆర్ సి ఇన్చార్జి జూలై 25; నేటి శుభోదయ :** కూటమి ప్రభుత్వంలో జరిగిన మంచి, చేసిన అభివృద్ధి, అందిస్తున్న సంక్షేమాన్ని ప్రజలకు వివరించేందుకు టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ పిలుపు మేరకు ఈ నెల 27 అనగా సోమవారం నుంచి నియోజకవర్గంలో 'ఇంటింటికీ తెలుగుదేశం- ప్రతి ఇంటికీ జూలకంటి' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు శాసన సభ్యుల వారి కార్యాలయం శనివారం ఓ ప్రకటనలో వెల్లడించింది. ఉదయం 11 గంటలకు కారంపూడి మండలం చినగార్లపాడు గ్రామం నుంచి ప్రారంభమయ్యే ఈ ప్రచార కార్యక్రమానికి ముందు పేటసన్నెగండ్ల అడ్డరోడ్డు వద్ద ఉన్న శ్రీ ఆంజనేయస్వామి వారి దేవస్థానంలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఇంటింట ప్రచారానికి శ్రీకారం చుడతారని పేర్కొంది. కావున కూటమి పార్టీల శ్రేణులు పెద్దఎత్తున తరలివచ్చి, ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రతి ఇంటికి ప్రచారం చేయడంలో భాగస్వాములు కావాలని కోరింది.

**తండ్రి బాటలో తనయుడు గౌతమ్ ..!**

ఈ నెల 27 నుంచే ప్రారంభమయ్యే 'ఇంటింటికీ తెలుగుదేశం – ప్రతి ఇంటికీ జూలకంటి' ప్రచార కార్యక్రమాన్ని మరోవైపు మాచర్ల రూరల్ మండలం నుంచి ఎమ్మెల్యే జూలకంటి తనయులు, యువ నాయకులు గౌతమ్ ప్రారంభిస్తారు. విజయపురి సౌత్ నుంచి ప్రారంభించే ఈ కార్యక్రమానికి కూటమి పార్టీ శ్రేణులు తరలిరావాలని కార్యాలయం కోరింది.

## ప్రతి విద్యార్థి ఆరోగ్యం ప్రభుత్వం బాధ్యత..!
# రూ.69 లక్షలతో అదనపు గదులు ప్రారంభోత్సవం

**–ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి**



**కారంపూడి: ఆర్ సి ఇన్చార్జి జూలై 25;నేటి శుభోదయ :** ప్రతి విద్యార్థి ఆరోగ్యంపై కూటమి ప్రభుత్వం ఎంతో బాధ్యతగా వ్యవహరిస్తోందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి వెల్లడించారు. శనివారం స్థానిక బ్రహ్మనాయుడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు పీఎం శ్రీ పథకం ద్వారా రూ.69 లక్షలతో నూతనంగా నిర్మించిన సైన్స్ ల్యాబ్, గ్రంథాలయం, కంప్యూటర్ ల్యాబ్ గదుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా ఎమ్మెల్యేకు విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చరణలు నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించి, నూతన గదులను ప్రారంభించారు. అనంతరం పాఠశాల అవరణలో మొక్కలు నాటి, భవిత కేంద్రం ద్వారా దివ్యాంగులకు అందించే ట్రై సైకిళు ,, ఇతర పరికాలను అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే జూలకంటి మాట్లాడుతూ.. విద్యావ్యవస్థలో సమూల మార్పులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. ప్రభుత్వ విద్యకు పెద్దపీట వేస్తూ పాఠశాలల్లో మౌలిక వసతులకు పెద్దఎత్తున నిధులు కేటాయిస్తున్నారని చెప్పారు. తల్లికి వందనం పథకం ఆర్థిక ఇబ్బందులతో బడికి దూరమవుతున్న బిడ్డలను బడి వైపు అడుగులు వేసేందుకు దోహదం చేస్తోందని వివరించారు. ఇద్దరు బిడ్డల చదువుకు డబ్బులు ఇస్తానని చెప్పి.., ఒక బిడ్డకు మాత్రమే ఇచ్చి, జగన్ రెడ్డి మోసం చేస్తే.. చదువు విలువ,ప్రాధాన్యత తెలిసిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఇంట్లో ఎంతమంది బిడ్డలు ఉంటే అంత మందికి తల్లికి వందనం నగదు జమ చేస్తున్నారని వెల్లడించారు. మాట ఇస్తే.., ఆ మాటపై నిలబడి ప్రజలకు మంచి చేయడం చంద్రబాబు నిజాయితీకి నిదర్శనమని చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి సురేష్, ఎంఈవో రవికుమార్, ఎంపీడీవో గంటా శ్రీనివాసరెడ్డి, ప్రధానోపాధ్యాయులు శివశశి రెడ్డి, సాగునీటి పంపిణీ సంఘాల చైర్మన్ పంగులూరు అంజయ్య, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మునుగోటి సత్యం, ఉన్న లక్ష్మీనారాయణ, మండల పార్టీ అధ్యక్షులు గోళ్ల సురేష్ యాదవ్, చప్పిడి రాము, బాలకృష్ణ, తండా మస్తాన్ జానీ, బొమ్మిన శేషగిరిరావు, బాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు. టీ టైమ్ విత్ స్టూడెంట్స్ యువత స్వరమే మన బలం..

## పాండురంగస్వామి దేవస్థానం పాలక మండలి ప్రమాణ స్వీకారం

**ముఖ్య అతిథిగా హాజరైన హోంమంత్రి అనిత**



**( నేటి శుభోదయ జులై : 26 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ )** పాయకరావుపేటలోని ప్రసిద్ధ శ్రీ పాండురంగస్వామి దేవస్థానం పాలక మండలి ప్రమాణ స్వీకార కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథిగా హాజరై ట్రస్టు బోర్డు సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా పాయకరావుపేట లక్ష్మి థియేటర్ నుంచి శ్రీ పాండురంగస్వామి ఆలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో హోంమంత్రి అనితతో పాటు కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మార్గమధ్యలో పట్టణ ప్రజలు అడుగడుగునా ఘన స్వాగతం పలికారు. గజమాలలతో సత్కరించగా, మహిళలు హారతులతో స్వాగతం తెలిపారు. అనంతరం హోంమంత్రి అనిత శ్రీ పాండురంగస్వామి వారిని దర్శించుకుని అంతరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనం అనంతరం వేద పండితులు మంత్రికి వేద ఆశీర్వచనం అందించారు. తదుపరి ఆలయ పాలక మండలి ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని హోంమంత్రి నిర్వహించారు. మజ్జూరి నారాయణరావు ట్రస్టు బోర్డు చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేయగా, మరో 11 మంది సభ్యులు సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా హోంమంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ,పాండురంగస్వామి ఆశీస్సులు నూతన పాలక మండలిపై ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటున్నానన్నారు. వందేళ్ల చరిత్ర కలిగిన ఈ ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వంలో సమర్థులకు బాధ్యతలు అప్పగిస్తున్నామని పేర్కొన్నారు. ఎన్నికల వరకు మాత్రమే రాజకీయాలు ఉంటాయని, ఎన్నికల అనంతరం అభివృద్ధే తమ ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. పాయకరావుపేట నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని, మెయిన్ రోడ్డును కూడా త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. గోదావరి జలాలు అనకాపల్లి జిల్లాకు చేరుతున్నాయని, పాయకరావుపేటలో నిర్వహించే జలహారతి కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరవుతారని వెల్లడించారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ స్థాయిలో అత్యాధునికంగా నిర్మించబడిందని, ఆ విమానాశ్రయాన్ని త్వరలో ప్రధానమంత్రి ప్రారంభించనున్నారని చెప్పారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రజలు పెద్ద ఎత్తున హాజరై ప్రధానమంత్రికి కృతజ్ఞతలు తెలియజేయాలని పిలుపునిచ్చారు. ఉత్తరాంధ్ర ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతోందని, ఇతర ప్రాంతాల నుంచి వలసలు వచ్చే పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. పాయకరావుపేట నియోజకవర్గంలో ఒకవైపు పరిశ్రమలు, మరోవైపు దేవాలయాలు, పర్యాటక ప్రాంతాలు ఉండటంతో ఈ ప్రాంతానికి మరింత అభివృద్ధి అవకాశాలు ఉన్నాయని హోంమంత్రి అనిత తెలిపారు.

## మిగిలిన భోజనమే విద్యార్థినుల అనారోగ్యానికి కారణమా

**– 40 మంది విద్యార్థినులకు వాంతులు, విరోచనాలు**

**-- చింతూరు, వి.ఆర్.పురం ఆసుపత్రుల్లో చికిత్స–**



**చింతూరు, నేటి శుభోదయ ::: పోలవరం జిల్లా :** చింతూరు సబ్‌డివిజన్ పరిధిలోని వి.ఆర్.పురం మండలం సోములగూడెం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో 40 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురికావడం కలకలం రేపింది. విద్యార్థినులకు వాంతులు, విరోచనాలు, వికారం వంటి లక్షణాలు కనిపించడంతో వెంటనే చింతూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి మరి కొంత మందిని విఆర్ పురం ప్రభుత్వాసుపత్రికి మిగిలిన వారిని అదే హాస్టల్లో ఉంచి చికిత్స అందించడం జరిగింది అని సమాచారం. ప్రస్తుతం వారంతా కోలుకుంటుండటంతో తల్లిదండ్రులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనకు గల కారణాలపై ప్రాథమికంగా పరిశీలిస్తే, ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన మెగా పేరెంట్--టీచర్ మీటింగ్ 4.0 సందర్భంగా పెద్ద ఎత్తున వండిన ఆహారం మిగిలిపోవడంతో, మిగిలిన అదే ఆహారాన్ని హాస్టల్ విద్యార్థినులకు వడ్డించినట్లు సమాచారం. నిల్వ ఉంచిన ఆహారం వికటించడంతోనే విద్యార్థినులు అస్వస్థతకు గురైనట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై అధికారిక నిర్ధారణ రావాల్సి ఉంది. సమాచారం అందుకున్న చింతూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి శుభం నక్వాల్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని, ఘటన జరిగిన ఆశ్రమ పాఠశాలను సందర్శించి చికిత్స పొందుతున్న విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. వైద్యులతో మాట్లాడి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. అలాగే ఈ ఘటనకు గల కారణాలపై సమగ్ర విచారణ చేపట్టి, నిర్లక్ష్యానికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈ ఘటన గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యత, నిల్వ విధానాలపై మరోసారి ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## ప్రతిభ కనబరిచిన సిబ్బంది సేవలను ప్రోత్సహిస్తూ 231 మందికి రివార్డ్



( నేటి శుభోదయ జులై : 26 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) సిబ్బంది సంక్షేమంతో పాటుగా వారు అందించిన సేవల యందు ప్రతిభను గుర్తిస్తూ, ఉన్నతాధికారుల సమక్షంలో 231 మందికి రివర్డు నగర పోలీసు కమీషనర్ డా.శంఖబ్రత బాగ్చి, ఐ.పి.ఎస్., క్రైమ్ రివ్యూ మీటింగ్ నందు గత నెల ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బంది సేవలను ప్రోత్సహిస్తూ 231 మందికి రివార్డ్ మంజూరు ఆర్డరును అందజేయడం జరిగినది. నగర పోలీసు శాఖ నందు హోంగార్డు నుండి సిఐ స్థాయి అధికారుల వరకూ వారు నిర్వహిస్తున్న విధులకు తగ్గా గుర్తింపు ఇస్తూ, ప్రతి నెలా ఉత్తమ ప్రతిభ కనబరిచిన తగు రివార్డులు అందజేసి, వారు సమర్థవంతముగా విధులు నిర్వహిస్తూ తోటి సిబ్బందికి ప్రేరణ ఇస్తూ అభివృద్ధి చెందుతున్న విశాఖ నగరం మరింత సురక్షితముగా ఉండే దిశగా సిపి చర్యలు తీసుకున్న విషయం విధితమే. గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తూ నగరం గుండా రవాణా అవుతున్న గంజాయిని సీజ్ చేసిన పలు కేసులలో, చోరీ కాబడిన సొత్తు,ఇతర వస్తువులను రికవరీ చేసి, నిందితులను అరెస్టు చేసిన పలు కేసులలో, సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి పేరుమోసిన నేరస్తులను అరెస్టు చేయడంలో ముఖ్యపాత్ర పోషించిన కేసులో, సైబర్ క్రైమ్ కేసులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 231 మంది, హోం గార్డు నుండి సీ.ఐ వరకూ గల సిబ్బందికి రివార్డులు మంజూరు చేసి, సిబ్బంది అందరూ ప్రేరణ చెంది మరింత మెరుగ్గా విధులు నిర్వర్తించేలా క్రైమ్ మీటింగ్ కు నందు నగర పోలీసు ఉన్నతాధికారుల సమక్షంలో రివార్డు మంజూరు ఆర్డరును ఇవ్వడం జరిగినది.

## సిబ్బంది సంక్షేమానికి మొదటి ప్రాధాన్యం ఇస్తూ..!!



**( నేటి శుభోదయ జులై : 26 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ )** 08 మంది అధికారులు మరియు సిబ్బందికి పదోన్నతులు, ముగ్గురికి కారుణ్య నియామకము క్రింద జూనియర్ అసిస్టెంట్లుగా నియామక పత్రాలు అందజేయడం జరిగినది. సిబ్బంది సంక్షేమానికి మొదటి ప్రాధాన్యం ఇస్తూ నగర పోలీసు కమీషనర్ డా.శంఖబ్రాత బాగ్చి, ఐ.పి.ఎస్., పదోన్నతి పొందిన సిబ్బందిని సత్కరించి, పదోన్నతి ర్యాంకులతో పాటుగా పోస్టింగ్ ఆర్డర్ అందజేయు కార్యక్రమం నిర్వహిస్తున్న విషయం విధితమే నగర పోలీసు కాన్ఫరెన్స్ హాల్ నందు నగర పోలీసు కమిషనరేట్ కు చెందిన 08 మంది అధికారులు మరియు సిబ్బందికి పదోన్నతులు అందించడం జరిగినది, 01 ఏ.సి.పి, ఏ.డి.సి.పి గా, 01 సి ఐ, ఏ.సి.పి గా, 02 ఏ.ఆర్.ఎస్.ఐ లు ,ఆర్.ఎస్.ఐ లుగా, 04 ఏ.ఆర్ కానిస్టేబుళ్లు, ఏ.ఆర్ హెడ్ కానిస్టేబుళ్ల గా పదోన్నతి అందజేయడం జరిగినది. అదే విధముగా ముగ్గురికి కారుణ్య నియామకము క్రింద జూనియర్ అసిస్టెంట్లుగా నియామక పత్రాలు అందజేయడం జరిగినది. సిబ్బంది సంక్షేమం కోసం ప్రత్యేక ప్రాధాన్యం ఎల్లప్పుడూ ఇచ్చే సిపి పోలీసు శాఖ నందు పదోన్నతి పొందిన సదరు సిబ్బందిని వారి కుటుంబ సభ్యులతో పాటుగా నగర పోలీసు కాన్ఫరెన్స్ హాల్ నకు ఆహ్వానించి , నూతన పదోన్నతి సంబంధించిన ర్యాంకులను, పోస్టింగ్ ఆర్డర్లను,కారుణ్య నియామక పత్రాలను ఇతర ఉన్నతాధికారులతో కలిసి స్వయముగా అందజేశారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి..!!



**( నేటి శుభోదయ జులై : 26 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ )** తేదీ 24.07.2026 రాత్రి సుమారు 11:10 గంటల సమయంలో, సీతమ్మధారలోని అల్లూరి సీతారామరాజు విగ్రహం సమీపంలో, అపోలో ఫార్మసీ ఎదురుగా, హెచ్‌బీ కాలనీ వైపు వెళ్తున్న సమయంలో కల్లూరు నిఖిలేష్, వయస్సు 24 సంవత్సరాలు, కెఆర్ఎం కాలనీ నివాసి, తన రాయల్ ఎన్‌ఫీల్డ్ ద్విచక్ర వాహనం ఏపీ 40 బి ఆర్ 8599పై ప్రయాణిస్తుండగా వాహనం అదుపుతప్పి రోడ్డుపై స్కిడ్ కావడంతో కిందపడినట్లు, ఈ ప్రమాదంలో నిఖిలేష్‌కు తీవ్రంగా తలకు గాయాలు కావడంతో, స్థానికుల సహాయంతో గురుద్వారా సమీపంలోని న్ ఆర్ ఐ ఆసుపత్రి లో చికిత్స నిమిత్తం చేర్పించారు. అయితే, చికిత్స పొందుతూ 25.07.2026 తెల్లవారుజామున సుమారు 01:00 గంటలకు మృతి చెందినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతుడు నిఖిలేష్ బీటెక్ పూర్తి చేసి వి ఎం ఆర్ డి ఏ లో ఇంటర్న్‌షిప్ చేస్తున్నాడు. ప్రమాదానికి ముందు రాత్రి సుమారు 7:00 గంటలకు షటిల్ ఆడేందుకు ఇంటి నుంచి తన ద్విచక్ర వాహనంపై బయలుదేరినట్లు, ఇంటికి తిరిగి వస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై మృతుడి తండ్రి కొల్లూరు శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎంవీపీ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయబడింది. సీఐ కే.న్ ఎస్,వి ప్రసాద్ కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తును హెచ్ సీ -2083 ఎం . దుర్గారావుకు అప్పగించారు. ప్రమాదానికి గల పూర్తి కారణాలు, ఇతర అంశాలపై దర్యాప్తు కొనసాగుతోంది.

## రైతుల ముఖాల్లో ఆనందం చూడడమే తన లక్ష్యం

**మార్కెట్ యార్డ్ చైర్ పర్సన్ బల్లా పల్లవి**



అనంతపురం జూలై 25 నేటి శుభోదయ :రైతుల ముఖాల్లో ఆనందం చూడడమే తన లక్ష్యం అని మార్కెట్ యార్డ్ చైర్ పర్సన్ బల్లా పల్లవి పేర్కొన్నారు. అనంతపురం నగరంలోని మార్కెట్ యార్డ్ లో ప్రతి శనివారం రైతులకు ఉచితంగా భోజన సదుపాయం కల్పిస్తున్నారు. నేను వారం మొత్తం ఎదురుచూసేది శనివారానికే... రైతులతో కలిసి భోజనం చేయడం, వారి ఆనందాన్ని దగ్గరగా చూడడం నా అదృష్టం. రైతుల ముఖాల్లో కనిపించే సంతోషమే నాకు మరింత సేవ చేయాలనే ప్రేరణను ఇస్తుంది. రైతు సోదరులతో గడిపే ప్రతి శనివారం నా జీవితంలో ఎంతో ప్రత్యేకమైన రోజు అని మార్కెట్ యార్డ్ చైర్ పర్సన్ బల్లా పల్లవి స్పష్టం చేశారు.

## హెల్మెట్ ధరించండి - ప్రాణాలు కాపాడుకోండి..

**– పోలీసు కమీషనర్ డా.శంఖబ్రత బాగ్చి, ఐ.పి.ఎస్., ఆదేశాల మేరకు**

**– 4వ టౌన్ ట్రాఫిక్ పోలీసుల వినూత్న అవగాహన**




**( నేటి శుభోదయ జులై : 26 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ )** విశాఖపట్నం ట్రాఫిక్ అవగాహన కార్యక్రమంలో భాగంగా ఫోర్త్ టౌన్ ట్రాఫిక్ ఎస్సై సుదర్శన్ రావు మరియు పెన్ స్కూల్ విద్యార్థులు కలిసి ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ యొక్క ప్రాముఖ్యతపై అక్కయ్యపాలెం జంక్షన్ వద్ద వినూత్న అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు మరియు ట్రాఫిక్ పోలీసులు కలిసి "హెల్మెట్ ధరించండి – ప్రాణాలు కాపాడుకోండి" అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ, ద్విచక్ర వాహనదారులకు కరపత్రాలు పంచి అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించకపోవడం వల్ల జరిగే ప్రమాదాల గురించి వివరిస్తూ, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై. సుదర్శన్ రావు కోరారు. విద్యార్థులు చేసిన ప్రదర్శన ప్రజలను ఆకట్టుకుంది.

## నిషేధిత జాబితాలో ఉన్న డాటెడ్ ల్యాండ్స్ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

**–కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో డాటెడ్ ల్యాండ్స్ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక సమావేశం సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డిఆర్ఓ ఏ.మలోల, ఆర్డీఓలు, తహసీల్దార్లు..**



**అనంతపురం బ్యూరో జూలై 25 నేటి శుభోదయ :** నిషేధిత జాబితాలో ఉన్న డాటెడ్ ల్యాండ్స్ సమస్యల పరిష్కారంపై జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డిఆర్ఓ ఏ.మలోల ప్రత్యేక దృష్టి పెట్టారు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో నిషేధిత జాబితాలో ఉన్న డాటెడ్ ల్యాండ్స్ సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఇందులో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డిఆర్ఓ ఏ.మలోల, ఆర్డీఓలు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఆర్ఐలు, విఆర్ఓలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిషేధిత జాబితాలో ఉన్న డాటెడ్ ల్యాండ్స్ ని తొలగించేందుకు, "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్), రెవెన్యూ క్లినిక్ కార్యక్రమంలో వస్తున్న అర్జీలను పరిష్కరించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగా ఈరోజు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వేగవంతంగా డాటెడ్ ల్యాండ్స్ సమస్యలు పరిష్కరించేందుకు జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డిఆర్ఓ కృషి చేస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల పరిధిలో ఎక్కువ సంఖ్యలో డాటెడ్ ల్యాండ్స్ క్లెయిమ్స్ ని పరిశీలించి, విచారించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్డీఓలు వసంతబాబు, ప్రేమంతకుమార్, కలెక్టరేట్ ఈ సెక్షన్ సూపరింటెండెంట్ రియాజుద్దీన్, ఆయా మండలాల తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు శశిథరూర్ ఝలక్



తిరువనంతపురం: కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ మరోసాకి కాంగ్రెస్‌ను ఇబ్బంది పెట్టే వ్యాఖ్యలు చేశారు. ఇటీవల అమెరికా జరిపిన దాడిలో భారత నావికుల మృతి పట్ల కేంద్రాన్ని కాంగ్రెస్ ఎండగడుతున్న తరుణంలో మోదీకి థరూర్ మద్దతుగా మాట్లాడారు. ఇటీవల జరిగిన జీ7 సమ్మిట్‌లో భారత్ సమస్యను తగిన రీతిలో మోదీ తెలియజేశారన్నారు. కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ వ్యవహారం ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు. తన ప్రతిపక్ష బీజేపీ విధానాలకు పలుమార్లు మద్దతిస్తూ సొంత పార్టీని తరచుగా ఇబ్బందులకు గురిచేస్తారు. తాజాగా ఆయన చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్‌ను మరోసారి ఇరకాటంలో పడేశాయి. ఇటీవల హర్మూజ్ జలసంధి ఒమన్ తీరంలో అమెరికా జరిగిన దాడిలో ముగ్గురు భారత నావికులు మరణించారు. ఈ అంశంలో కేంద్రం తగిన విధంగా స్పందించడం లేదని కాంగ్రెస్ ఎండగడుతుంది. ఇటీవల జరిగిన జీ-7 సమ్మిట్‌లోనూ ప్రధాని ఈ విషయంపై ట్రంప్‌తో తగిన విధంగా స్పందించలేదని మౌనంగా ఉన్నారని విమర్శలు గుప్పించింది. అయితే కాంగ్రెస్ ప్రధానిని ఎండగట్టే యత్నం చేస్తుంటే.. ఆ పార్టీ ఎంపీ శశిథరూర్ మాత్రం మోదీని ప్రశంసిస్తూ మాట్లాడారు. "ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షునితో జరిగిన బహిరంగ, ప్రైవేట్ సమావేశాల్లోనూ తన అభిప్రాయాన్ని స్పష్టం చేశారు. యుద్ధ సమయంలో వాణిజ్య నౌకల్లోని పౌర నావికులు పోరాటానికి లక్ష్యం కాకూడదనే సందేశాన్ని తెలియజేయడం చాలా ముఖ్యం. వారు సైనికులు కాదు,ఒకవేళ వారు అమెరికా నౌకదళ దిగ్బంధనాన్ని ఉల్లంఘిస్తుంటే వారిని మరో పద్ధతిలో నిరోధించండి కానీ చంపడం మార్గం కాదు ప్రధాని మోదీ తెలియజేసిన సందేశం ఇదే," అని థరూర్ అన్నారు. అయితే ఒమన్ తీరంలో నావికుల మృతిపై మోదీ మౌనంగా ఉన్నారని కాంగ్రెస్ విమర్శలు గుప్పిస్తున్న సమయంలో థరూర్ వాఖ్యలు రాజకీయంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. శశిథరూర్ వ్యాఖ్యలను సమర్థిస్తూ బీజేపీ కౌంటర్ మట్నదలు పెట్టింది. ఆ పార్టీ అధికార ప్రతినిధి మాట్లాడుతూ "కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ బండారం బయటపెట్టారు. కాంగ్రెస్ నాయకులు ప్రధాని నరేంద్రమోదీజీ దౌత్యనీతిని బహిరంగంగా ప్రశంసిస్తున్నారు. భారతదేశ జాతీయ ప్రయోజనాలను కాపాడే విషయంలో ప్రధాని మోదీకే మొదటి స్థానం "అని అన్నారు.

# 'ఎన్‌టీఏ అబుదాబి' నిర్వాకంపై రాహుల్ నిప్పులు!



న్యూఢిల్లీ: వైద్య విద్య ప్రవేశ పరీక్ష 'నీట్' నిర్వహణ తీరుపై మరోసారి తీవ్ర దుమారం రేగింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) చేసిన ఒక పొరపాటు ఒక విద్యార్థి భవిష్యత్తును అంధకారంలోకి నెట్టడమే కాకుండా, దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది. నాగ్‌పూర్‌కు చెందిన ఒక విద్యార్థికి రీ-ఎగ్జామ్ సెంటర్ ఏకంగా విదేశాల్లో (అబుదాబి) కేటాయించడంపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ శనివారం కేంద్ర ప్రభుత్వంపై, ఎన్‌టీఏపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. నాగ్‌పూర్‌కు చెందిన ఒక విద్యార్థి నెల రోజులుగా ఎంతో కష్టపడి నీట్ రీ-ఎగ్జామ్ కోసం సన్నద్ధమయ్యాడు. అయితే పరీక్షకు సరిగ్గా ఒక్కరోజు ముందు అతను తన అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్ చేసుకోగా, అందులోని పరీక్షా కేంద్రం చూసి షాక్‌కు గురయ్యాడు. ఆ విద్యార్థికి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని 'అబుదాబి'లో సెంటర్ కేటాయించారు. ఈ ఉదంతంపై రాహుల్ గాంధీ ఎక్స్ 'ఎక్స్' వేదికగా తన ఆవేదన వ్యక్తం చేస్తూ, ఎన్‌టీఏ పనితీరును తప్పుపట్టారు. అసలు ఇలాంటి ఘోరమైన తప్పు ఎలా జరుగుతుందని ఆయన ప్రశ్నించారు. 'విద్యార్థి ఉన్న నగరంలోనే ఒక పరీక్షా కేంద్రాన్ని సరిగ్గా కేటాయించలేని విద్యా వ్యవస్థకు, ఇలాంటి అత్యున్నత స్థాయి పరీక్షలను నిర్వహించే హక్కు ఎక్కడిది?' అని ?ప్రశ్నించారు. విద్యార్థుల, వారి తల్లిదండ్రుల సహనాన్ని ఎన్‌టీఏ పరీక్షిస్తోందని ఆయన మండిపడ్డారు. ఇటీవల తాను కోటాలో విద్యార్థులను కలిసి వారి బాధలను పంచుకున్న విషయాన్ని గుర్తు చేస్తూ, ప్రస్తుత విద్యా వ్యవస్థ యువతను పూర్తిగా నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. దేశంలోని ప్రస్తుత పరిస్థితిని విమర్శిస్తూ.. 'ఇది నిజమైన విద్యా వ్యవస్థ కాదు, ఇది ఒక తరానికి చెందిన డబ్బును, సమయాన్ని, మానసిక ప్రశాంతతను నిలువునా దోపిడీ చేసిందన్నారు. పిల్లల భవిష్యత్తుతో జూదం ఆడటం ఇకనైనా ఆపాలని కేంద్ర ప్రభుత్వానికి హితవు పలికారు. దేశంలోని విద్యార్థులకు బాధ్యతాయుతమైన, సమాధానం చెప్పే విద్యా వ్యవస్థ, పరీక్షా యంత్రాంగం అవసరమని ఇందుకోసం తాము పోరాడి తీరుతామని రాహుల్ గాంధీ హెచ్చరించారు.

## భువనగిరి కోటకు పర్యాటక హంగులు..

# రోప్‌వే, పార్కింగ్, హోటల్

**హైదరాబాద్, :** భువనగిరి కోట అభివృద్ధి పనులను అక్టోబర్ 2 లోగా పూర్తిచేయాలని పర్యాటక శాఖ



మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. సోమవారం కోట వద్ద పర్యటించిన ఆయన కొనసాగుతున్న పనుల పురోగతిని సమీక్షించారు. రోప్‌వే, హోటల్, పార్కింగ్, మరుగుదొడ్లు, చిన్నారుల ఆటస్థలం, కోట పునరుద్ధరణ పనులు, కేఫ్, ఇంటర్‌ప్రిటేషన్ సెంటర్ సహా పర్యాటక సదుపాయాలను పరిశీలించారు. అవసరమైతే రాత్రింబవళ్లు పనులు చేపట్టి గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక రంగానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని జూపల్లి తెలిపారు. చారిత్రక వైభవాన్ని కాపాడుతూ భువనగిరి కోటను ఆధునిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. యాదాద్రి, భువనగిరి కోట, కొలనుపాకలను అనుసంధానిస్తూ సమగ్ర ఆధ్యాత్మిక -వారసత్వ పర్యాటక సర్క్యూట్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం స్వదేశ్ దర్శన్ 2.0 పథకం కింద రూ.56.81 కోట్లతో 'భువనగిరి ఫోర్ట్ ఎక్స్‌పీరియెన్షియల్ జోన్' ప్రాజెక్టుకు ఆమోదం తెలిపింది. ఇందులో రూ.17.91 కోట్లతో 1,020 మీటర్ల పొడవైన రోప్‌వే నిర్మిస్తున్నారు. గంటకు 250 నుంచి 300 మంది ప్రయాణికులు వినియోగించుకునే సామర్థ్యంతో ఈ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. మిగిలిన నిధులతో రహదారులు, పార్కింగ్, వీక్షణ గ్యాలరీ, కేఫ్, విద్యుదీకరణ, తాగునీటి సదుపాయాలు, సీసీ కెమెరాలు, భద్రతా వ్యవస్థలు, వారసత్వ కట్టడాల పునరుద్ధరణ వంటి పనులు చేపడుతున్నారు.

# బండి భగీరథ్‌కు బెయిల్ మంజూరు

హైదరాబాద్: తెలంగాణలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. పోక్సో కేసులో బండి భగీరథ్‌కు బెయిల్ మంజూరైంది. మల్కాజ్‌గిరి కోర్టు భగీరథ్‌కు బెయిల్ మంజూరు చేసింది. కాగా, రెండు వారాలకుపైగా రిమాండ్‌లో ఉన్న బండి భగీరథ్‌కు బెయిల్ రావడంతో బయటకు రానున్నాడు. అయితే బెయిల్‌కు సంబంధించిన షరతులను తప్పనిసరిగా పాటించాలని న్యాయస్థానం స్పష్టం చేసినట్లు సమాచారం. మైనర్‌పై లైంగిక వేధింపులకు పాల్పడ్డారన్న ఆరోపణలతో బాధిత బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బండి భగీరథ్‌పై కేసు నమోదైన విషయం తెలిసిందే. ఫిర్యాదులో పేర్కొన్న ఆరోపణల ఆధారంగా పోలీసులు ౹ాజూూ చట్టంలోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ కేసులో నిందితుడిగా ఉన్న భగీరథ్‌ను పోలీసులు కోర్టు ముందు హాజరుపరచగా, న్యాయస్థానం ఆయనకు రిమాండ్ విధించింది. కోర్టు రిమాండ్ విధించడంతో ఆయన జైల్లోనే శిక్ష అనుభవిస్తున్నారు. ఈ నేపథ్యంలో భగీరథ్ తరపు న్యాయవాదులు మల్కాజ్‌గిరి కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ బెయిల్ పిటిషన్‌పై శనివారం కోర్టులో సుదీర్ఘంగా వాదనలు జరిగాయి. భగీరథ్ తరపు న్యాయవాదులు తమ వాదనలను వినిపిస్తూ బెయిల్ ఇవ్వాల్సిందిగా కోరారు. ఇరుపక్షాల వాదనలను విన్న గౌరవ న్యాయస్థానం.. కొన్ని నిబంధనలతో కూడిన బెయిల్‌ను మంజూరు చేస్తూ తీర్పునిచ్చింది. కోర్టు నుంచి బెయిల్ ఆర్డర్ రావడంతో భగీరథ్ జైలు నుంచి విడుదల కానున్నారు.

# ట్రంప్-మెలోనీ.. ఎక్కడ చెడింది?.. ఆ ఐదే ఘటనలే కారణమా?

మొన్నటిదాకా జార్జియా మెలోనీ.. డొనాల్డ్ ట్రంప్‌కు యూరప్‌లో అత్యంత సన్నిహిత మిత్రురాలిగా గుర్తింపు పొందారు. ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత, ఆయనకు అత్యంత నమ్మకమైన యూరోపియన్ భాగస్వామిగా నిలిచారు. ఒకరిపై ఒకరు ప్రశంసల వర్షం కురిపించుకోవడం, బహిరంగ వేదికలపై పరస్పరం సరదా వ్యాఖ్యలు చేసుకోవడం కనిపించింది. అలాంటిది ఈ ఇద్దరి మధ్య అకస్మాత్తుగా మాటల యుద్ధం మొదలవడం, అది వ్యక్తిగత విమర్శల స్థాయికి చేరుకోవడం అంతర్జాతీయ రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. అసలు ట్రంప్--మెలోనీ స్నేహానికి ఎక్కడ బీటలు వారాయో గమనిస్తే.. ట్రంప్--మెలోనీ బంధం కేవలం రాజకీయ అనుబంధం మాత్రమే కాదు. కుడిపక్ష(రైట్‌వింగ్) భావజాలం, వలసల నియంత్రణ, జాతీయవాద విధానాలు వంటి అనేక అంశాల్లో ఇద్దరి ఆలోచనలు ఒకేలా ఉండేవి. అందుకే యూరప్‌లో ట్రంప్‌కు అత్యంత సన్నిహిత మిత్రురాలిగా మెలోనీకి గుర్తింపు లభించింది. అయితే ఇటీవల చోటుచేసుకున్న కొన్ని పరిణామాలు ఈ స్నేహంపై ప్రభావం చూపినట్లు కనిపిస్తున్నాయి. ఇది ఒక్క ఫొటో వివాదం కాదు. గత కొన్ని నెలలుగా పేరుకుపోతున్న రాజకీయ విభేదాల ఫలితంగా కనిపిస్తోంది. ఆ ఐదు కారణాలివే..




### 1. మొదటి చిచ్చు.. యుద్ధమే!

ట్రంప్‌కు మెలోనీ ఎంత సన్నిహితురాలో చెప్పడానికి ఒక ఉదాహరణ చాలనిపిస్తుంది. 2025లో ఆయన రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేసిన వేడుకకు హాజరైన ఏకైక యూరోపియన్ నాయకురాలు కూడా ఆమెనే. ఆ తర్వాత గాజా శాంతి చర్చల సందర్భంగా మెలోనీపై ట్రంప్ ప్రశంసల జల్లు కురిపించారు. 'అందం, తెలివితేటలు రెండూ ఉన్న నాయకురాలు' అంటూ కొనియాడారు. కానీ ఇరాన్ యుద్ధం తర్వాత పరిస్థితి మారడం మొదలైంది. హర్మూజ్ జలసంధి భద్రత, ఇరాన్‌పై ఒత్తిడి వంటి అంశాల్లో అమెరికా వైఖరికి ఇటలీ పూర్తి మద్దతు ఇవ్వలేదు. యుద్ధంలో పాల్గొనేందుకు మెలోనీ నిరాకరించడంతో ట్రంప్‌లో అసంతృప్తి పెరిగింది. ఆ అసంతృప్తి క్రమంగా బహిరంగ విమర్శలకు దారితీసింది. మెలోనీకి ధైర్యం లేదని, అంతర్జాతీయ సంక్షోభాల విషయంలో ఆమె సరైన నాయకత్వం చూపడం లేదంటూ ట్రంప్ వ్యాఖ్యానించడం ఇద్దరి మధ్య విభేదాలు ఎంత దూరం వెళ్లాయో చెప్పకనే చెబుతోంది.

### 2. పోప్ లియో వివాదం

ఇరాన్ యుద్ధంపై పోప్ లియో XIV శాంతి సందేశం ఇవ్వడం కూడా ఇద్దరి మధ్య దూరాన్ని మరింత పెంచింది. యుద్ధం విస్తరించకుండా చర్చల ద్వారానే పరిష్కారం వెతకాలని పోప్ పిలుపునివ్వగా.. ట్రంప్ మాత్రం ఆయన వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుబట్టారు. అంతర్జాతీయ భద్రతా అంశాలపై పోప్ మాట్లాడటం తగదన్నట్లుగా వ్యాఖ్యానించారు. అయితే కాథలిక్ సంప్రదాయాలకు ప్రాధాన్యం ఇచ్చే ఇటలీ ప్రధాని మెలోనీ మాత్రం పోప్‌కు బహిరంగంగా అండగా నిలిచారు. ట్రంప్ వ్యాఖ్యలు అంగీకారయోగ్యం కావని, పోప్ అభిప్రాయాలను గౌరవించాల్సిందేనని ఆమె స్పష్టం చేశారు.

### జీ7లో ఫోటో వివాదం ట్రంప్ పుకార్లు మెలోనీ ఆగ్రహం

ఈ పరిణామం ట్రంప్‌కు ఏమాత్రం నచ్చలేదని చెబుతున్నారు. అప్పటివరకు మిత్రురాలిగా భావించిన మెలోనీ.. తనకు వ్యతిరేకంగా బహిరంగంగా మాట్లాడుతున్నారనే భావన ఆయనలో ఏర్పడింది. దీంతో మాటల యుద్ధం మరింత ముదిరింది. ఒక దశలో పోప్ కంటే మెలోనీనే పరిస్థితులను సరిగా అర్థం చేసుకోవడం లేదంటూ ట్రంప్ సెటైర్లు వేయగా.. మెలోనీ కూడా వెనక్కి తగ్గకుండా తన వైఖరిని సమర్థించుకున్నారు. దీంతో విధానపరమైన విభేదం క్రమంగా వ్యక్తిగత స్థాయికి చేరిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### 3. జీ7లో బహిరంగ విభేదాలు

ఫ్రాన్స్‌లో జరిగిన జీ7 సదస్సులోనే ఇద్దరి మధ్య విభేదాలు మొదటిసారి బహిరంగంగా బయటపడ్డాయి. ఇరాన్ యుద్ధం, నాటో బాధ్యతలు, పశ్చిమ దేశాల పాత్ర వంటి అంశాలపై జరిగిన చర్చల్లో ట్రంప్ తన అసంతృప్తిని దాచుకోలేదు. యూరప్ అమెరికాను ఒంటరిగా వదిలేసిందని, నాటో మిత్రదేశాలు తమ బాధ్యతలను పూర్తిగా నిర్వర్తించడం లేదని ఆయన వ్యాఖ్యానించారు. అయితే మెలోనీ ఈ వ్యాఖ్యలను నేరుగా సవాలు చేసినట్లు దౌత్య వర్గాలు చెబుతున్నాయి. అమెరికా--యూరప్ భాగస్వామ్యం ఇప్పటికీ బలంగానే ఉందని, పశ్చిమ దేశాల మద్దతును తక్కువ చేసి చూపడం సరైంది కాదని ఆమె స్పష్టం చేసినట్లు సమాచారం. ఇద్దరూ ఒకే సోఫాపై కూర్చొని చర్చిస్తున్న దృశ్యాలు బయటకు కనిపించినా.. ఆ సమావేశాల్లో వాతావరణం అంత స్నేహపూర్వకంగా లేదని అంతర్జాతీయ మీడియా పేర్కొంది. ట్రంప్ తరచూ చేస్తున్న 'యూరప్ మమ్మల్ని వదిలేసింది' అన్న వ్యాఖ్యలను మెలోనీ ఖండించగా.. ట్రంప్ కూడా తన వైఖరి నుంచి వెనక్కి తగ్గలేదని చెబుతున్నారు. దీంతో ఇంతకాలం తెరవెనుక మాత్రమే ఉన్న విభేదాలు జీ7 వేదికగా అందరికీ కనిపించే స్థాయికి చేరుకున్నాయి. చాలా మంది విశ్లేషకుల దృష్టిలో ఇదే ఇద్దరి బంధంలో కీలక మలుపుగా నిలిచింది.

### 4. ఫొటో వ్యాఖ్యలతో మరింత దూరం

ఇద్దరి మధ్య పెరుగుతున్న దూరానికి ప్రతీకగా నిలిచింది ఈ ఫొటో వివాదం. జీ7 సమావేశం సందర్భంగా మెలోనీ తనతో ఫొటో దిగేందుకు "బతిమాలిందని", "ఆమెపై జాలిపడి ఫొటో ఇచ్చానని" ట్రంప్ వ్యాఖ్యానించారు. సాధారణంగా ఇలాంటి వ్యాఖ్యలను పెద్దగా పట్టించుకోని మెలోనీ ఈసారి మాత్రం వెంటనే స్పందించారు. ట్రంప్ వ్యాఖ్యలు పూర్తిగా కల్పితమని, తాను గానీ, ఇటలీ గానీ ఎప్పుడూ ఎవ్వరినీ బతిమాలుకోదని ఘాటుగా కౌంటర్ ఇచ్చారు. అంతటితో ఆగకుండా, పశ్చిమ దేశాల మిత్రుల పట్ల ట్రంప్ చూపుతున్న వైఖరిపై కూడా ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. అమెరికా మిత్రదేశాల కంటే ప్రత్యర్థి దేశాల నేతల పట్ల ఆయన మరింత మర్యాదగా వ్యవహరిస్తున్నారని పరోక్షంగా విమర్శించారు. మరోవైపు ట్రంప్ కూడా వెనక్కి తగ్గలేదు. ఒకప్పుడు మెలోనీ తన అభిమానుల్లో ఒకరని, కానీ ఇప్పుడు ఆమె తనకు అభిమానిగా ఉండటం ఇష్టం లేదంటూ మరోసారి వ్యాఖ్యానించారు. దీంతో రాజకీయ విభేదాలుగా మొదలైన ఈ ఘర్షణ.. వ్యక్తిగత విమర్శల స్థాయికి చేరిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఒకప్పుడు ఒకరిపై ఒకరు ప్రశంసలు కురిపించుకున్న ఇద్దరు నేతలు ఇప్పుడు బహిరంగంగానే పంచులు వేసుకోవడం పరిస్థితి ఎంత మారిపోయిందో చెబుతోంది.

### 5. మెలోనీ శిబిరం నుంచి ఎదురుదాడి

ఈ వివాదంలో అత్యంత గమనార్హమైన అంశం మెలోనీ చుట్టూ ఉన్న నాయకుల స్పందన. సాధారణంగా ట్రంప్‌పై నేరుగా విమర్శలు చేయడానికి దూరంగా ఉండే మెలోనీ శిబిరం ఈసారి మాత్రం అసాధారణంగా ఘాటుగా స్పందించింది. ప్రధాని కార్యాలయంలో అత్యంత ప్రభావశీల వ్యక్తిగా భావించే జియోవాన్‌బట్టిస్టా ఫజ్జోలారి ఏకంగా ట్రంప్ అమెరికా--యూరప్ చారిత్రక సంబంధాలను దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. తన వ్యాఖ్యలతో యూరప్ అంతటా అమెరికా వ్యతిరేక భావన పెరిగేలా చేస్తున్నారని కూడా విమర్శించారు. ఇంతటితో ఆగకుండా, ఇటలీ విదేశాంగ మంత్రి ఆంటోనియో తజానీ తన అమెరికా పర్యటనను రద్దు చేసుకోవడం మరింత చర్చకు దారి తీసింది. దీనితో పాటు అమెరికాలో జరగాల్సిన ఇటలీ--అమెరికా వ్యాపార సదస్సు కూడా వాయిదా పడింది. ఈ వివాదాన్ని కేవలం ట్రంప్--మెలోనీ మధ్య వ్యక్తిగత ఘర్షణగా చూడలేం. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత అమెరికా--యూరప్ సంబంధాలు, నాటో బాధ్యతలు, ఇరాన్ యుద్ధం, హర్మూజ్ జలసంధి భద్రత వంటి అంశాలపై ఇరువైపులా పెరుగుతున్న భిన్నాభిప్రాయాలకు ఇది తాజా ప్రతిబింబంగా కనిపిస్తోంది. ఒకప్పుడు ట్రంప్‌కు యూరప్‌లో అత్యంత విశ్వసనీయ మిత్రురాలిగా భావించిన మెలోనీ సైతం ఇప్పుడు బహిరంగంగానే విభేదించడం పరిస్థితి ఎంత మారిపోయిందో సూచిస్తోంది. అందుకే ఈ మాటల యుద్ధం ఇద్దరు నేతలకే పరిమితమవుతుందా? లేక అమెరికా--యూరప్ మధ్య పెరుగుతున్న వ్యూహాత్మక దూరానికి, అట్లాంటిక్ మిత్రబంధంలో కొత్త సమీకరణాలకు నాంది పలుకుతుందా? అన్నది ఇప్పుడు అంతర్జాతీయ రాజకీయాల్లో ఆసక్తికర చర్చగా మారింది.

## ఆస్తి పన్ను నుంచి ట్రాఫిక్ చలాన్ల వరకు
## గ్రేటర్‌లో డిజిటల్ చెల్లింపులకు కొత్త దిశ
## 90 రోజుల్లో అన్ని శాఖల అనుసంధానం

# అన్నిటికీ ఒకటే క్యూర్

గ్రేటర్ నగర ప్రజలు ఇకపై వివిధ ప్రభు త్వ విభాగాలకు చెందిన వివిధ సేవల చెల్లింపులను ఒకే యాప్ (క్యూర్--1) ద్వారా చేయొచ్చు. ఈ మేరకు ప్రభు త్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ యాప్ ద్వారా క్యూర్ పరిధిలోని జీహెచ్‌ఎంసీ, సీఎంసీ, ఎంఎంసీల్లో 'కామన్ యూనిఫైడ్ బిల్లింగ్ అండ్ కలెక్షన్ సిస్టం' అమలుకు మార్గ దర్శకాలు జారీ చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఈ వ్యవస్థ ద్వారా ఆస్తి పన్ను, విద్యుత్ బిల్లులు, నీటి బిల్లులు, ట్రాఫిక్ చలాన్లు తదితర ప్రభుత్వ బకాయిలన్నింటినీ ఒకే డిజిటల్ ప్లాట్‌ఫాంలో చెల్లించే అవకాశం కల్పించనున్నారు. ప్రస్తుతం నగర ప్రజలు వివిధ శాఖలకు సంబంధించిన బిల్లులు, పన్నులు చెల్లించేందుకు వేర్వేరు పోర్టళ్లను వినియోగించాల్సి వస్తోంది. ఈ పరిస్థితి వల్ల ప్రజలకు ఇబ్బందులు, శాఖలకు వసూళ్ల సమన్వయంలో సమస్యలు, ఆదాయ లీకేజీలు చోటుచేసుకుంటున్నాయని గుర్తించిన ప్రభుత్వం.. ఈ యాప్ ద్వారా సమగ్ర చెల్లింపు వ్యవస్థను అందుబాటులోకి తేనుంది. దీంతో చెల్లింపుల పారదర్శకత, జవాబుదారీతనం, వసూళ్ల సామర్థ్యం పెరగడంతో పాటు విభిన్న చెల్లింపు వ్యవస్థల అవసరం తొలగిపోనుంది.

### ఏ సేవలు అందుబాటులోకి?

మొదటి దశలో జీహెచ్‌ఎంసీ, సీఎంసీ, ఎంఎంసీలకు సంబంధించిన ఆస్తి పన్ను, ట్రేడ్ లైసెన్సులు, సెల్ఫ్ అసెస్‌మెంట్, సూపర్ స్ట్రక్చర్ ఫీజులు, ఖాళీ భూముల పన్ను (వీఎల్‌టీ) చెల్లింపులను అనుసంధానించనున్నారు. అలాగే టీజీ ఎస్పీడీసీఎల్ విద్యుత్ బిల్లులు, జలమండలికి సంబంధించిన వాటర్, సివరేజి చార్జీలు, హైదరాబాద్ ట్రాఫిక్ చలాన్ల చెల్లింపులు కూడా ఈ వేదికలోకి రానున్నాయి. భవిష్యత్తులో ప్రభుత్వం సూచించే ఇతర సేవలను కూడా ఇందులో చేర్చనున్నారు. యాప్ నిర్వహణ బాధ్యతలను సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ)కు అప్పగించనున్నారు.




### రోజువారీ సెటిల్‌మెంట్

యాప్ ద్వారా జరిగే అన్ని చెల్లింపులు మీ సేవ పేమెంట్ గేట్‌వే ద్వారా ప్రాసెస్ అవుతాయి. వసూలైన మొత్తా లు తాత్కాలికంగా కేంద్ర ఖాతాలో నిల్వ చేసి, టీం0 లేదా టీం1 విధానంలో సంబంధిత శాఖలకు బదిలీ చేస్తారు. పేమెంట్ వైఫల్యాలు, రీకన్సిలియేషన్ సమస్యలు, ఇతర సేవా వివాదాల పరిష్కారం కోసం కేంద్రీకృత గ్రీవెన్స్ రెడ్రెస్సల్ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. పౌరులు క్యూర్ --1 యాప్,మై క్యూర్ యాప్, ఆయా శాఖల పోర్టళ్ల ద్వారా ఫిర్యాదులు నమో దు చేసుకునే అవకాశం ఉంటుంది. అన్ని శాఖలు 90 రోజుల్లోపు క్యూర్--1 యాప్‌తో చెల్లింపు వ్యవస్థలోకి మారా ల్సి ఉంటుంది. కాగా.. ఒకే డిజిటల్ ఎకో సిస్టమ్ లక్ష్యంతో రాష్ట్ర ప్రభు త్వం తీసుకొచ్చిన క్యూర్ --1 యాప్ నగర పాలనలో డిజిటల్ సంస్కరణలకు కొత్త మైలురాయిగా నిలవనుందని అధికారులు భావిస్తు న్నారు. 3 కార్పొరేషన్ల పరిధిలోని పౌరులకు సౌకర్యవంతమైన, పారదర్శకమైన సేవలు అందుతాయని పేర్కొంటున్నారు.

# అమెరికా అమిత్ర వైఖరి





ఒకసారంటూ పొరపొచ్చాలు వచ్చాక ఎంత సన్నిహిత మిత్రుల మధ్యనైనా తిరిగి సాధారణ సంబంధాలు ఏర్పడటం అంత సులభం కాదు. ఫ్రాన్స్‌లో జరిగిన జీ--7 దేశాల శిఖరాగ్ర సదస్సు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మధ్య బుధవారం జరిగిన ద్వైపాక్షిక సమావేశం తీరుతెన్నులు గమనిస్తే ఈ సంగతి సులభంగా అర్థమవుతుంది. ట్రంప్ గత 16 నెలలుగా అనుసరిస్తున్న అమిత్ర వైఖరి ఇందుకు కారణం. మిత్ర దేశాలని లేదు, ప్రత్యర్థి దేశాలని లేదు -- అందరినీ ఒకే గాటన కడుతూ, ఒక దేశాధినేతకు ఉండాల్సిన కనీస ఔచిత్యాన్ని మరిచి ఇష్టానుసారం మాట్లా డటం ఆయనకు అలవాటుగా మారింది. అంతేకాదు -- ఎడాపెడా అధిక సుంకాలు విధించటం, తమ సరుకుపై సుంకాలు తగ్గించాలని కోరడం వంటివి మన దేశాన్ని చీకాకు పరి చాయి. ఇలాంట చేదు అనుభవాలు ఎన్ని ఎదురైనా మన దేశం సంయమనం పాటించింది. నిజానికి మొన్న భారత నావికులు ముగ్గుర్ని హోర్మూజ్ జలసంధి వద్ద హత్య చేసిన ఉదంతంతోసహా ఈ 16 నెలల పొడవునా మన దేశం పరుషంగా మాట్లాడింది ఎప్పుడూ లేదు. నోబెల్ శాంతి బహుమతి యావలో భారత్--పాక్ యుద్ధాన్ని తానే ఆపాననీ, ఇద్ద రినీ తీవ్రంగా బెదిరించాననీ మాట్లాడినప్పుడు అందులో ఏమాత్రం నిజం లేదని మన దేశం చెప్పింది. ఆయన ఇలా డప్పుకొట్టుకుంటున్నప్పుడల్లా మొదట్లో ఖండిస్తూనేవచ్చింది. కానీ దీన్ని ఆయన ఒక అలవాటుగా మార్చుకున్నారని తేలాక మిన్నకుండి పోయింది. అయినా ట్రంప్‌లో ఆగ్రహావేశాలు తగ్గలేదని తాజా సమావేశం రుజువు చేసింది. మాటలకేం... ట్రంప్ చాలా మాట్లాడారు. 55 నిమిషాలపాటు సాగిన ఈ సమావేశం అనంతరం 'మోదీ మంచిగా కనబడతారు. బాగుంటారు. దేవదూత. కానీ 'కిల్లర్'. వాణిజ్య, వ్యాపార చర్చల్లో చాలా కఠినంగా, నిక్కచ్చిగా ఉంటారు' అంటూ ప్రశంసలతో ముంచెత్తారు. మోదీ ప్రధానిగా ఉన్నంతకాలం ఎవరైనా భారత్‌వైపు కన్నెత్తి చూస్తే వాళ్ల అంతు చూస్తామని కూడా చెప్పారు. వాణిజ్య ఒప్పందం విషయంలో చాలా దగ్గరగా వచ్చేశామని కూడా అన్నారు. కానీ చేతలు చూస్తే అందుకు అనుగుణంగా లేవు. తన ఆధ్వర్యంలోని కమాండ్లలో ఒకటైన ఇండో--పసిఫిక్ కమాండ్‌కు ఆ పేరు పెట్టింది ఆయన ఏలుబడిలోని అమెరికాయే. తిరిగి ఆయనే ఎనిమిదేళ్లనాటి ఆ పేరులో భారత్‌నుసూచించే 'ఇండో' తొలగించి ఇప్పుడు యూఎస్--పసిఫిక్ కమాండ్‌గా మార్చటం, అది కూడా ఈ సమావేశానికి కొంచెం ముందుగా చేయటం యాదృచ్ఛికమేమీ కాదు. ఇటీవల యూఎస్--పసిఫిక్ కమాండ్‌లో పాక్ ఆక్రమిత కశ్మీర్(పీఓకే)ను పాకిస్తాన్‌లో అంతర్భాగంగా చూపటంలోనూ అమెరికా దురుద్దేశం స్పష్టమే. పాకిస్తాన్ పాలకులతో ట్రంప్‌కి ఏర్పడిన కొత్త చుట్టరికం అందరికీ తెలుసు. తూర్పు, దక్షిణ చైనా సముద్ర ప్రాంతాల్లో చైనా దూకుడునూ, ఆధిపత్య ధోరణుల్నీ ఎదుర్కొనటానికి ఆ దేశంతో సమస్యలున్న భారత్‌ను కలుపుకోవాలని నిర్ణయించి 2007లో క్వాడ్‌కు అంకురార్పణ చేసింది అమెరికాయే. హిందూ మహా సముద్రప్రాంతంలో చైనా విస్తరణవాద వైఖరిని ఎదుర్కొనటానికి క్వాడ్, దాంతోపాటు ఇండో-- పసిఫిక్ కమాండ్ తోడ్పడతాయని కూడా అప్పట్లో తెలిపింది.


కానీ స్వప్రయోజనాలే తప్ప మరేమీ పట్టని అమెరికాను నమ్ముకుని ముందడుగు వేయొద్దని అనేకమంది నిపుణులు అప్పట్లోనే మన దేశాన్ని హెచ్చరించారు. ఇవాళ చైనాతో అంటకాగటానికి రెడీ అయి, ఆ కమాండ్ పేరే మార్చిన అమెరికా కీలక సమయాల్లో ఎలా ఉండగలదో సులభంగానే ఊహించుకోవచ్చు. ట్రంప్ రెండోసారి అధ్యక్ష పీఠం ఎక్కిన వెంటనే అందరికన్నా ముందు ఆయనతో వాణిజ్య ఒప్పందంపై చర్చించింది మనమే అయినా... మన తర్వాత వచ్చిన దేశాలు ఇప్పటికే ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. మనం కూడా బ్రిటన్, యూరోపియన్ యూని యన్ (ఈయూ), కెనడాలతో వాణిజ్య ఒప్పందాలు ఖరారు చేసుకోగలిగాం. వీటిపై లాంఛనంగా సంతకాలు చేయటమే మిగిలివుంది. మనకి నచ్చని అంశాలున్నప్పుడూ, అన్యాయమైన షరతులు పెడుతున్నప్పుడూ వ్యతిరేకించటం, కొంత జాప్యం జరిగినా ఈ విషయంలో మన ప్రయోజనాల పరిరక్షణకే ప్రాముఖ్యతనివ్వటం సరైన వైఖరి. ఉత్త మాటలతో ఎవరినీ నమ్మించలేమని ట్రంప్ గ్రహించేలా చేయటం అవసరం.

# బెర్రీ కోకలో పిసీ వీపందం చూడు





ఇక్కడ గ్లోబల్ ఐకాన్ ప్రియాంక చోప్రా ఫోజ్ చూశాక ఫ్యాన్స్ ఇలా కామెంట్ చేస్తున్నారు. ప్రియాంక చోప్రా బెర్రీ రెడ్ చీరలో షో స్టాపర్ గా నిలిచింది. అయితే ఈ గెటప్ తో ఎక్కడ మెరిసింది? అని ప్రశ్నిస్తే.. తన సోదరుడు సిద్ధార్థ్ పెళ్లికి అటెండయిన పీసీ ఇలా వేడుక ఆద్యంతం సెంటరాఫ్ ఎట్రాక్షన్ గా నిలిచారు. ఈ వేడుకకు భారీగా సినీసెలబ్రిటీలు అటెండయ్యారు. దేశీ గర్ల్ ప్రియాంక చోప్రా జోనాస్ కి ఈ కస్టమ్ మేడ్ డిజైనర్ డ్రెస్ ని ఎవరు రూపొందించారు? అంటే ది గ్రేట్ మనీష్ మల్హోత్రా అని కూడా చెబుతున్నారు. ఆమె స్టైలిస్ట్ అమీ పటేల్ ఇన్‌స్టాలో - పీసీలీషియస్ బెర్రీలిషియస్ - అని రాసింది. నీష్ డిజైనర్ లుక్ సౌందర్యాన్ని సెలబ్రేట్ చేసుకున్నారు. బోల్డ్ అండ్ బెర్రీలీషియస్ కస్టమ్ మేడ్ చీర అదే రంగులో 3%ణ% ఎంబ్రాయిడరీ బ్లౌజ్‌తో పీసీ ఎంతో ఆకర్షణీయంగా కనిపించింది. ఈ చీర కూడా 3%ణ% ఎంబ్రాయిడరీ టోన్‌ను కలిగి ఉంది. ప్రియాంక తన సోదరుడు సిద్ధార్థ్ చోప్రా వివాహ వేడుకల కోసం ఈ చీరను ప్రత్యేకంగా డిజైన్ చేయించారని సమాచారం. ఆ ఒక్క లుక్కుతో పెళ్లిలో అహూతులను పీసీ కిల్ చేసింది. బెర్రీ చీరలో రియల్ స్టన్నర్ గా మెరిసిపోయింది. ప్రియాంక ధరించిన ఆభరణాలు అంతే ఖరీదైనవి. ఆకర్షణీయమైనవి.. చోకర్ -ముత్యాలు, కెంపులు -వజ్రాలతో అలంకరించిన లేయర్డ్ నెక్లెస్, డైమండ్ బ్రాస్‌లెట్‌తో కూడిన బల్గారి ఆభరణాలతో తన రూపాన్ని మరింత మెరుగుపరిచింది. రీగల్ సెట్ లో ప్రియాంక దేశీ గ్లామ్ లుక్ హీట్ పెంచింది. 2024లో మరో అద్భుతమైన మూవ్ మెంట్ ఇది అంటూ అభిమానులు ప్రశంసిస్తున్నారు. సెలబ్రిటీ స్టైలిస్ట్ అమీ పటేల్‌కు ప్రియాంక వైబ్‌ని ఎలా సెలబ్రేట్ చేయాలో సూపర్బ్ గా తెలుసు! అని కూడా కితాబిచ్చేస్తున్నారు. సెలబ్రిటీ హెయిర్ స్టైలిస్ట్ ఫ్లోరియన్ హురెల్ రూపొందించిన రెట్రో హై మెస్సీ బన్ హెయిర్ స్టైల్ ప్రియాంక లుక్ కి మరో అదనపు ఆకర్షణ. సిగ్నేచర్ బోల్డ్ లిప్ కలర్‌తో స్టైలిష్ లుక్‌ని వందశాతం ఫుల్ ఫిల్ చేసింది పీసీ. ఇన్‌స్టాలో షేర్ చేసిన ఫోటోలలో తన ప్రియమైన స్నేహితురాలు తమన్నా దత్ కూడా పాస్టెల్ చీరను ధరించి కనిపించింది. %-%బెర్రీస్ అండ్ క్రీమ్%-% అనే క్యాప్షన్ ని ఈ చీరకు ఇచ్చింది. చాలా సంవత్సరాలుగా ప్రియాంక మనీష్ డిజైన్‌లను ఉపయోగిస్తోంది. అతడు రూపొందించే అద్భుతమైన డిజైనర్ దుస్తుల్లో చీరకు స్థిరమైన స్థానం ఉంది. దోస్తానా చిత్రంలోని -దేశీ గర్ల్ - పాటలో పీసీ ధరించిన ఖరీదైన చీరను మనీష్ రూ పొందించాడు. నీలం ఉపాధ్యాయతో నిశ్చితార్థం చేసుకున్న ప్రియాంక సోదరుడు ఏప్రిల్ 2024లో రోకా వేడుకను జరుపుకున్నారు. ఈ వేడుకకు ప్రియాంక, నిక్ జోనాస్ , వారి కుమార్తె మాల్తీ మేరీ చోప్రా జోనాస్ హాజరయ్యారు.



# చూపు తిప్పనివ్వని 'రంగబలి' హీరోయిన్





మోడలింగ్ చేస్తూ 2019 లో ఎంటీవీ సూపర్ మోడల్ ఆఫ్ ది ఇయర్ లో నాల్గవ స్థానంలో నిలిచి అందరి దృష్టిని ఆకర్షించిన ముద్దుగుమ్మ యుక్తి తరేజా. మోడల్ గా చాలా కాలంగా పలు కమర్షియల్స్ లో నటిస్తూ ఉన్న ఈ అమ్మడికి తెలుగు లో నాగ శౌర్య హీరోగా నటించిన రంగబలి సినిమాలో నటించే అవకాశం దక్కింది. ఆ సినిమా కమర్షియల్ గా నిరాశ పరచడంతో యుక్తి తరేజా కి పెద్దగా ఆఫర్లు రావడం లేదు. ఆమె సోషల్ మీడియా ద్వారా తన అందమైన ఫోటోలను షేర్ చేస్తూ మళ్లీ ఆఫర్ల కోసం ప్రయత్నాలు చేస్తోంది. హర్యానా సమీపంలోని కైతల్ ప్రాంతంలో 2000 సంవత్సరంలో పర్వీన్ తరేజా, రీటా తరేజాలకు జన్మించిన యుక్తి తరేజా మోడల్ గా దక్కించుకున్న గుర్తింపు కారణంగా ఇమ్రాన్ హష్మి చేసిన లూట్ గయే మ్యూజిక్ ఆల్బం లో కనిపించింది. ఆ పాటలో స్క్రీన్ స్పేస్ తక్కువ ఉండటం వల్ల ఈమె కెరీర్ కి ఆ పాట కూడా పెద్దగా హెల్ప్ అయ్యింది లేదు. అయితే ఆ పాట వల్ల పలు ఆఫర్లు ఈ అమ్మడికి వచ్చాయి. మోడల్ గా మరింగా బిజీ అయ్యిందని ఆమె సన్నిహితులు అంటూ ఉంటారు. తాజాగా సోషల్ మీడియాలో అందమైన ఫోటోను షేర్ చేసింది. వైట్ టాప్ తో బ్లూ డెనిమ్ జీన్స్ షార్ట్ తో కన్నుల విందు చేసే విధంగా యుక్తి తరేజా కవ్విస్తూ ఉంది. ఈ స్థాయి అందం కు టాలీవుడ్ లో తగిన గుర్తింపు రావడం లేదు అంటూ కొందరు కామెంట్స్ చేస్తే మరి కొందరు మాత్రం చూపు తిప్పుకోనివ్వని ఈ అమ్మడి అందంకు ఇప్పుడు కాకున్నా ముందు ముందు అయినా తప్పకుండా మంచి ఆఫర్లు వస్తాయనే అభిప్రాయంను వ్యక్తం చేస్తూ ఫోటోలను లైక్ చేస్తూ తెగ కామెంట్స్ చేస్తూ షేర్ చేస్తున్నారు. గత సంవత్సరం ప్రేక్షకుల ముందుకు వచ్చిన రంగబలి సినిమాకు పవన్ బసంశెట్టి దర్శకత్వం వహించాడు. సుధాకర్ చెరుకూరి ఈ సినిమాను శ్రీ లక్ష్మి వెంకటేశ్వర సినిమాస్ బ్యానర్ పై నిర్మించాడు. విభిన్నమైన టైటిల్ తో వచ్చిన ఈ సినిమాకు ప్రేక్షకుల నుంచి తిరస్కరణ ఎదురైంది. ఈ సినిమా లో నాగ శౌర్య, యుక్తి తరేజాలతో పాటు సత్య, షైన్ టామ్ చాకో, శరత్ కుమార్ మురళి శర్మ ఇంకా ప్రముఖ నటీనటులు నటించారు. కథ విషయంలో నిరాశ పరచినా కూడా కొన్ని పాత్రలు బాగున్నాయనే రివ్యూలు వచ్చాయి.



# లంగావోణిలో జగతి.. నడుముతోనే స్టన్ అయ్యేలా..





తెలుగు టెలివిజన్ రంగం లో ప్రత్యేక గుర్తింపు పొందిన నటీమ ణులలో జ్యోతి రాయ్ ఒకరు. 'జగతి' పాత్రతో ప్రేక్షకులకు పరిచయమైన ఆమె, తన నటనతో తెలుగు ప్రేక్షకుల గుండెల్లో చోటు సంపాదించుకుంది. ఇటీవల, జ్యోతి తన గ్లామర్ ఫోటోల ద్వారా సోషల్ మీడియాలో మరింత క్రేజ్ తెచ్చుకుంది. జ్యోతి తన జీవితంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించి, దర్శకుడు సుకు పూర్వాజ్‌తో వివాహం చేసుకుంది. తన పేరును జ్యోతి పూర్వాజ్‌గా మార్చుకున్న ఆమె, కొత్త పేరుతోనే కాదు, కొత్త లుక్‌తో కూడా ఆకట్టుకుంటోంది. కొన్ని రోజుల క్రితం మినీ డ్రెస్సులో ఆమె షేర్ చేసిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతూ, ఆమె అందానికి ఫ్యాన్స్ ఫిదా అయిపోయారు. ఇక లేటెస్ట్ గా అమ్మడు నల్లని రంగు లంగా వోణిలో అందంగా దర్శనమిచ్చింది. గతంలో ఎన్నోసార్లు గ్లామర్ డ్రెస్సులో కనిపించిన జ్యోతి ఈ లుక్ లో ఇంకా అందంగా ఉందంటూ ఫాలోవర్స్ పాజిటివ్ గా రియాక్ట్ అవుతున్నారు. ఇంటర్నెట్‌లో జ్యోతి ఫోటోలను చూసిన అభిమానులు ఆమె స్టైల్, గ్లామర్ గురించి ప్రశంసలు కురిపిస్తున్నారు. మరింత అందంగా కనిపిస్తున్న ఆమె టాటూలు కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఫ్యాన్స్ ఆమె లుక్‌పై పాజిటివ్ రియాక్షన్లు ఇస్తున్నారు. అభిమానులను ఆకట్టుకుంటూ జ్యోతి తన కెరీర్‌లో కూడా బిజీగా ఉంది. టెలివిజన్‌లో 'గుప్పెడంత మనసు' సీరియల్ ద్వారా పాపులారిటీ పొందిన ఆమె, వెబ్ సిరీస్‌లు, సినిమాల్లోనూ తన ప్రయాణాన్ని కొనసాగిస్తోంది. ప్రస్తుతం జ్యోతి తన భర్త సుకు పూర్వాజ్‌తో కలిసి ప్రముఖ చిత్ర దర్శకుడు రూపొందిస్తున్న 'ఏ మాస్టర్ పీస్' చిత్రంలో కీలక పాత్రలో నటిస్తోంది.పాటు, తన ఈ చిత్రం విజయవంతమైతే, జ్యోతి కెరీర్‌లో కీలక మలుపు తిరగవచ్చు. గ్లామర్‌తో నటనతో కూడా ప్రేక్షకులను మెప్పించడానికి జ్యోతి కృషి చేస్తోంది. తెలుగులో హీరోయిన్‌గా స్థిరపడాలని లక్ష్యంగా పెట్టుకున్న ఈ నటీమణి, భవిష్యత్తులో మరిన్ని అవకాశాలు అందుకోవాలని అభిమానులు ఆశిస్తున్నారు.

# సామ్ ఏంటి ఇలా మారిపోయింది? ఏం జరుగుతోంది?



స్టార్ హీరోయిన్ సమంత.. ఈ మధ్య వార్తల్లో బాగా నిలుస్తోంది. మయోసైటిస్ బారిన పడ్డ తర్వాత సినిమాలకు గ్యాప్ ఇచ్చిన ఆమెను మళ్లీ సిల్వర్ స్క్రీన్ పై చూసేందుకు అభిమానులు ఎంతగానో వెయిట్ చేస్తున్నారు. అయితే అమ్మడు ఎప్పుడో పూర్తి చేసిన సిటాడెల్ హనీ బన్నీ వెబ్ సిరీస్ మరికొద్ది రోజుల్లో స్ట్రీమింగ్ కానుంది. తన బ్యానర్ పై ఓ సినిమాను అనౌన్స్ చేసిన విషయం తెలిసిందే. మరిన్ని ప్రాజెక్టుల విషయంలో చర్చలు జరుపుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. అయితే సోషల్ మీడియాలో మాత్రం ఫుల్ యాక్టివ్ గా ఉంటుంది సమంత. తన ఫ్యాన్స్ కోసం ఎప్పటికప్పుడు కొత్త పిక్స్ షేర్ చేసుకుంటోంది. హెల్త్ కు సంబంధించిన పలు విషయాలు పోస్ట్ చేస్తుంటుంది. అదే సమయంలో ఈ మధ్య ఓ స్పెషల్ అప్డేట్ అని చెప్పి.. పికిల్ బాల్ లీగ్ లో చెన్నై ఫ్రాంచైజీని కొనుగోలు చేసినట్లు ప్రకటించింది. అప్పుడు సామ్.. డెనిమ్ జీన్స్, బ్లాక్ కలర్ పోలో టీ షర్ట్ లో కాస్త ఫిట్ గా కనిపించింది. కానీ ఆమె బాగా సన్నబడిందని నెటిజన్లు కామెంట్స్ పెట్టారు. ఇటీవల ముంబైలో జరిగిన అనామికా ఖన్నా %శ ఎడవీ% కలెక్షన్ లాంచ్ ఈవెంట్ లో బ్లాక్ కలర్ డ్రెస్ లో సమంత తళుక్కుమంది. ఫాబ్రిక్ పెయింట్ డిజైన్ డ్రెస్ అదిరిపోయినా.. సామ్ పిక్స్ చూసి మాత్రం షాకయ్యామని ఫ్యాన్స్ చెబుతున్నారు. పూర్తిగా ఆమె మారిపోయినట్లు కనిపిస్తోందని అంటున్నారు. అదేంటి ఎందుకు అలా అయిపోయిందని కామెంట్స్ పెడుతున్నారు. ఒక్కసారిగా బాగా వెయిట్ తగ్గడం చూస్తుంటే షాకింగ్ గా ఉందని అంటున్నారు. సామ్ ఫేస్ లో అప్పటి గ్లో కనిపించడం లేదని చెబుతున్నారు. ఒక్కొక్కరు ఒక్కోలా రెస్పాండ్ అవుతున్నారు. పర్సనల్ రీజన్ వల్ల సన్నబడిందా, లేక మయోసైటిస్ చికిత్సలో భాగంగా స్లిమ్ అయిందా అని అనుమానపడుతున్నారు. మరికొందరు సన్నబడినా.. హెల్దీగా ఉంటే చాలని చెబుతున్నారు. ఏదేమైనా సామ్ కొత్త లుక్ చూసి మాత్రం ఒక్కసారిగా అంతా షాకైనట్లు కనిపిస్తోంది. ప్రస్తుతం సోషల్ మీడియాలో సమంత కొత్త పిక్స్ తెగ చక్కర్లు కొడుతున్నాయి. ఇక సామ్ కెరీర్ విషయానికి వస్తే.. బాలీవుడ్ స్టార్ హీరో వరుణ్ ధావన్ తో కలిసి చేసిన సిటాడెల్ వెబ్ సిరీస్ అమెజాన్ ప్రైమ్ వీడియో ఓటీటీలో నవంబర్ 7వ తేదీ నుంచి స్ట్రీమింగ్ కానుంది. అందుకు సంబంధించిన ప్రమోషన్స్ త్వరలో స్టార్ట్ కానున్నాయి. తన బర్త్ డే రోజు అనౌన్స్ చేసిన మా ఇంటి బంగారం మూవీలో లీడ్ రోల్ లో నటిస్తూనే ప్రొడ్యూస్ చేయనుంది సమంత. మరి ఈ సినిమాతో ప్రేక్షకుల ముందుకు ఆమె ఎప్పుడు వస్తుందో వేచి చూడాలి.